తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం.. నిర్భయంగా
హైదరాబాద్ | ఆదివారం, మార్చి 1, 2026 పేజీలు 8
/aksharagalam.com
సంపుటి : 14 సంచిక : 4 వెల : 3/-

## బుర్జ్ ఖలీఫాను ఖాళీ చేయించిన ప్రభుత్వం



దుబాయ్‌లోని ప్రపంచంలోని అత్యంత ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫాను అక్కడి ప్రభుత్వం ఖాళీ చేయించింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కలిసి ఇరాన్ మీద దాడులకు పాల్పడుతోన్న విషయం తెలిసిందే. దీనితో ఇరాన్ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌పై బాలిస్టిక్ క్షిపణిలను ప్రయోగించింది. ఈ క్రమంలో బుర్జ్ ఖలీఫా నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. అమెరికా సైనిక సిబ్బందికి స్థావరంగా ఉన్న అల్ దఫ్రా వైమానిక స్థావరాన్ని ఇరాన్ దళాలు లక్ష్యంగా చేసుకోవడంతో అబుదాబి, దుబాయ్‌లలో బాంబుల మోత మోగింది. దుబాయ్‌లో భారీ పేలుడు శబ్దం వినిపించిందని, అయితే ఆ శబ్దం క్షిపణి దాడి వల్ల జరిగిందా లేక మరేదైనా కారణమా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. దుబాయ్ బీచ్‌ల నుంచి దోహా వీధుల వరకు పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ఇరాన్ ఒకేసారి వివిధ దేశాలలోని అమెరికా లక్ష్యాలపై దాడులు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. యూఏఈ రాజధాని అబుదాబీలో సీఎన్ఎన్ విలేకరులు పేలుళ్ల శబ్దాలు విన్నారు.

## పశ్చిమాసియాలో



# యుద్ధ మేఘాలు




### ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు

- టెహ్రాన్ సహా పలు నగరాల్లో భీకర పేలుళ్లు
- అణు, సైనిక స్థావరాలే ప్రధాన లక్ష్యాలు
- ఇరాన్ ప్రతిదాడులతో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత
- క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలపై దాడులు
- పాఠశాలపై దాడిలో దారుణ ప్రాణనష్టం
- పూర్తిస్థాయి యుద్ధానికి దారి తీసే ప్రమాదం

దుబాయ్: పశ్చిమాసియా మరోసారి అగ్నికుండంలా మారింది. అమెరికా, తన మిత్రదేశం ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై భారీ స్థాయిలో సైనిక దాడులు ప్రారంభించడంతో ప్రాంతం మొత్తం రణరంగాన్ని తలపిస్తోంది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ', 'ఆపరేషన్ రోరింగ్ లయన్' పేర్లతో చేపట్టిన ఈ దాడుల్లో శనివారం ఉదయం నుంచి ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు పలు కీలక నగరాలపై క్షిపణులు, భారీ బాంబులతో విరుచుకుపడ్డాయి. ముఖ్యంగా ఉత్తర టెహ్రాన్‌లో ఒకేసారి అనేక ప్రాంతాలు లక్ష్యంగా మారగా, పేలుళ్లతో నగరం దద్దరిల్లిపోయింది. ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా, ఇజ్రాయెల్ వర్గాలు ప్రకటించాయి. సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ నివాసాలు, కార్యాలయాల పరిసరాల్లోనే తొలి పేలుళ్లు సంభవించినట్లు సమాచారం.

దాడుల సమయంలో ఖమేనీ, అధ్యక్షుడిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఇరాన్ వర్గాలు చెబుతున్నప్పటికీ, పలువురు కీలక సైనిక కమాండర్లు మరణించినట్లు అంతర్జాతీయ వార్తలు సూచిస్తున్నాయి. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రధాన కార్యాలయం సహా పలు రక్షణ స్థావరాలపై జరిగిన క్షిపణి దాడులు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేస్తున్నాయి. టెహ్రాన్‌తో పాటు దేశవ్యాప్తంగా అనేక నగరాలు పేలుళ్లతో అట్టుడికిపోతుండగా, ఆకాశమంతా దట్టమైన పొగ కమ్మేసిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. గత ఎనిమిది నెలల్లో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన రెండో పెద్ద దాడి ఇదే కావడం

(మిగతా 2వ పేజీలో)



## వేట్లపాలెం
# విషాద విస్ఫోటం

- బాణసంచా కర్మాగారంలో పేలుడు
- సజీవ దహనమైన 20 మంది కార్మికులు
- మరో పది మందికి తీవ్ర కాలిన గాయాలు
- కాకినాడ జిల్లాలో దారుణ ఘటన
- పేలుడు ధాటికి చెల్లాచెదురైన మృతదేహాలు
- ఐదు కిలోమీటర్ల దూరం వరకూ వినిపించిన శబ్దాలు
- ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు
- ప్రధాని, ముఖ్యమంత్రి సంతాపం

కాకినాడ : కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శనివారం సంభవించిన బాణసంచా పరిశ్రమ పేలుడు హృదయ విదారక విషాదాన్ని మిగిల్చింది. వెలుగులు నింపాల్సిన టపాసుల తయారీ కేంద్రం ఒక్కసారిగా మృత్యు కందకంగా మారి నిండు ప్రాణాలను బలి తీసుకుంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ భారీ విస్ఫోటంలో 20 మంది కార్మికులు సజీవదహనమవగా, మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రత అంతలా ఉండటంతో అక్కడ పనిచేస్తున్న వారి శరీర భాగాలు చెల్లాచెదురుగా ఎగిరిపడి భీతావహ దృశ్యాలు కనిపించాయి. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో బాధిత కుటుంబాల రోదనలు హృదయాలను కలిచివేశాయి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. తీవ్రమైన కాలిన గాయాలతో ఉన్న బాధితులను వెంటనే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి

(మిగతా 2వ పేజీలో)



## నన్ను చంపడానికి ప్రయత్నించారు
::: మంత్రి వాకిటి

- ఏళ్లుగా టార్గెట్ చేస్తున్నారన్న ఆరోపణ
- మున్సిపల్ ఎన్నికల్లో తప్పుడు ప్రచారాలపై ఆవేదన
- అవమానాలే రాజకీయాల్లోకి రావడానికి కారణమన్న మంత్రి
- మక్తల్ అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం
- చావుకు భయపడనని ధైర్యంగా వ్యాఖ్యలు
- రెండేళ్లలో భారీ నిధులు తెచ్చినట్లు వెల్లడి
- వెనుకడుగు వేయకుండా సేవ కొనసాగిస్తానని స్పష్టం

నారాయణపేట: తెలంగాణ రాజకీయాల్లో మంత్రి వాకిటి శ్రీహరి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఎన్నో సంవత్సరాలుగా తన ప్రాణాలపై దాడి ప్రయత్నాలు జరుగుతున్నాయని

(మిగతా 2వ పేజీలో)

## మార్చి 6 నుంచి 'ప్రజాపాలనప్రగతి'
# 99 రోజుల మిషన్

- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం
- గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమగ్ర అమలు
- పథకాలు ప్రజల దరి చేరేలా యంత్రాంగానికి ఆదేశాలు
- పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌కు మిషన్ మోడ్
- సాంకేతిక సంస్కరణలకు జయేశ్ రంజన్ కమిటీ
- ఐఏఎస్ అధికారుల పనితీరుపై సీఎం గట్టి హెచ్చరిక
- జూన్ 2 తెలంగాణ పండుగను ఘనంగా నిర్వహణ లక్ష్యం
- డిజిటల్ గవర్నెన్స్‌తో ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు



హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థంగా ప్రజలకు చేరేలా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక'ను అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2ను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ప్రత్యేక షెడ్యూల్‌తో కార్యాచరణ చేపట్టి ప్రజలకు పథకాల ఫలితాలు ప్రత్యక్షంగా అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమానికి ప్రత్యేక లోగో రూపొందించాలంటూ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. సచివాలయంలో శనివారం జరిగిన కార్యదర్శుల సమీక్ష సమావేశంలో సీఎం అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఫైళ్లలో తీసుకునే నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలుగా కనిపించాలన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనం నిజంగా

(మిగతా 2వ పేజీలో)

# కాంగ్రెస్ దేశ ప్రతిష్టను దెబ్బతీస్తోంది: ప్రధాని మోదీ




::: విపక్షంపై మోదీ మండిపాటు

- ఏఐ సదస్సు ఘటనపై అసంతృప్తి
- అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం రాజస్థాన్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు శ్రీకారం
- సెమీకండక్టర్ రంగంలో భారత్ దూసుకెళ్తోందని వ్యాఖ్య
- డబుల్ ఇంజిన్ పాలనపై ప్రశంసలు
- దేశ ప్రతిష్ట కాపాడాలని పిలుపు

## ఫార్ములా-ఈ కేసులో సంచలనం
# అర్వింద్‌కుమార్ సస్పెన్షన్

- కేటీఆర్ సహా పలువురిపై అభియోగాల ముసాయిదా
- గవర్నర్, డీఓపీటీ అనుమతులతో మారిన సమీకరణాలు
- ఏసీబీ ఛార్జిషీట్‌కు రంగం సిద్ధం
- ఈడీ ఎంట్రీతో మనీలాండరింగ్ కోణం ముదుర్చి
- న్యాయపరమైన తుది చర్యలపై ఉత్కంఠ





# శుభపరిణామం

: రేవంత్ నిర్ణయంపై హరీశ్ ప్రశంసలు

- శారదాపీఠంకు కేటాయించిన భూములు పీఠానికే చెందేలా సీఎం ఆదేశాలు
- ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమన్న హరీశ్
- రేవంత్ రెడ్డికి అమ్మారు ఇప్పటికైనా సరైన బుద్ధి ప్రసాదించారన్న హరీశ్ రావు

# పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

గమనార్హం. గతంలో జరిగిన దాడుల్లో ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు పేర్కొంటున్నారు. అమెరికాతో సమన్వయంతోనే ఈ దాడులు జరుగుతున్నాయని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. నెలల తరబడి సన్నాహాలు చేసి రూపొందించిన వ్యూహం మేరకే ఆపరేషన్ కొనసాగుతోందని సైనిక వర్గాలు వెల్లడించాయి. అయితే దాడుల వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం పూర్తిస్థాయిలో బయటకు రాలేదు. కానీ ఇరాన్ తక్షణమే ప్రతిస్పందిస్తూ ప్రతిదాడులకు దిగింది. ముందుగా ఇజ్రాయెల్‌పై భారీ స్థాయిలో క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఆ వెంటనే గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై కూడా లక్ష్యంగా దాడులు జరిపింది. బహ్రెయిన్, కువైట్, ఖతర్, యూఏఈ వంటి దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై క్షిపణులు ప్రయోగించినట్లు ఇరాన్ ప్రకటించింది. కువైట్ విమానాశ్రయం, అబుదాబిలోని అల్ దఫ్రా వైమానిక స్థావరం, ఖతర్‌లోని అల్ ఉడెయిడ్ స్థావరాలు లక్ష్యంగా మారినట్లు సమాచారం. గల్ఫ్ వ్యాప్తంగా సైరన్లు, పేలుళ్ల మోతతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సౌదీ అరేబియా, దుబాయ్ ప్రాంతాలపైనా క్షిపణి దాడి యత్నాలు జరిగాయని వెల్లడైంది. జోర్డాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను మధ్యలోనే కూల్చివేసినట్లు ప్రకటించింది. యూఏఈపై జరిగిన దాడుల్లో ఒకరు మరణించినట్లు స్థానిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘర్షణలు మరికొన్ని వారాలు కొనసాగవచ్చన్న అంచనాలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. పరిస్థితులు అదుపులోకి రాకపోతే పూర్తిస్థాయి యుద్ధానికి దారి తీసే అవకాశముందని రక్షణ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇరాన్‌కు మద్దతుగా హెజ్బొల్లా యుద్ధరంగంలోకి దిగుతామని ప్రకటించగా, యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్ గ్రూపు కూడా ఎర్ర సముద్రంలోని నౌకా రవాణాను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఇరాన్‌లోని అణు స్థావరాలపై కూడా అమెరికా, ఇజ్రాయెల్ ముమ్మర దాడులు కొనసాగిస్తున్నాయి. ఇస్ఫహాన్, తబ్రీజ్ వంటి కీలక అణు, క్షిపణి కేంద్రాలు భారీ పేలుళ్లతో కంపించాయి. టెహ్రాన్, షిరాజ్, చాబహార్, బుషెహర్, కోమ్, కరజ్, కెర్మన్‌షా తదితర నగరాలు కూడా దాడులకు గురైనట్లు సమాచారం. అణు, రక్షణ, నౌకా స్థావరాలపై దాడులు తీవ్రంగా కొనసాగుతుండగా దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితి నెలకొంది. దక్షిణ ఇరాన్‌లోని హార్మోగన్ ప్రావిన్స్‌లో మినాబ్ నగరంలో బాలికల పాఠశాలపై జరిగిన దాడి అత్యంత విషాదకరంగా మారింది. ఈ ఘటనలో 85 మందికి పైగా విద్యార్థులు మృతి చెందినట్లు ప్రభుత్వ మీడియా తెలిపింది. మరో అనేక మంది గాయపడ్డారు. దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య 200 దాటిందని, 700 మందికి పైగా గాయపడినట్లు ఇరాన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. సైనిక, నిఘా కార్యాలయాలు, రక్షణ కేంద్రాలు కూడా వరుస దాడులకు గురవుతున్నాయి. దాడుల నేపథ్యంలో ఖమేనీ నివాసానికి వెళ్లే మార్గాలను మూసివేయడంతో పాటు దేశవ్యాప్తంగా మొబైల్ సేవలను నిలిపివేశారు. ప్రజలు భయాందోళనలకు గురై నగరాలు విడిచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఇజ్రాయెల్‌లో కూడా దేశవ్యాప్త అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణులను మధ్యలోనే అడ్డుకుంటున్నామని అక్కడి సైన్యం పేర్కొంది.

ఇరాన్ గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా స్థావరాలపై తీవ్ర దాడులు జరిపి వందలాది అమెరికా సైనికులను హతమార్చినట్లు ప్రకటించింది. బహ్రెయిన్‌లోని ఐదో ఫ్లీట్ ప్రధాన కార్యాలయం, కువైట్‌లోని సైనిక స్థావరాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ఖతర్, కువైట్, యూఏఈ



ప్రాంతాల్లో పేలుళ్ల దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తమపై జరిగిన దాడి యత్నాలను నిర్వీర్యం చేసినట్లు ఖతర్ ప్రకటించగా, సౌదీ అరేబియా ఇరాన్ చర్యలను తీవ్రంగా ఖండించింది. తర్వాత సౌదీ రాజధాని రియాద్‌పై కూడా క్షిపణి దాడి యత్నాలు జరిగినట్లు వెల్లడైంది. అయితే వాటిని గాల్లోనే అడ్డుకున్నామని సౌదీ తెలిపింది. ఇరాన్ చర్యలను పిరికిపంద చర్యగా అభివర్ణిస్తూ తగిన ప్రతిస్పందన ఇస్తామని హెచ్చరించింది. ఇదే సమయంలో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను నిలిపివేసినట్లు ఇరాన్ ప్రకటించడం అంతర్జాతీయ ఆర్థిక రంగంలో కలకలం రేపింది.

శనివారం ఉదయం తొలుత ఇజ్రాయెల్ దాడులకు తెరతీయగా, అనంతరం అమెరికా సైన్యం కూడా రంగంలోకి దిగింది. ఇరాన్ అగ్ర నాయకత్వంతో పాటు అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, భారీ బాంబులతో దాడులు జరిపింది. కొద్ది గంటల తర్వాత తేరుకున్న ఇరాన్ ఇజ్రాయెల్‌పై రెండు దఫాలుగా క్షిపణి దాడులు చేసి, ఆపై గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. దాడుల నేపథ్యంలో ఖమేనీ ఎక్కడున్నారన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఇరాన్‌లో నాయకత్వ మార్పే తమ లక్ష్యమని అమెరికా, ఇజ్రాయెల్ ముందుగానే ప్రకటించడంతో ఈ దాడులకు రాజకీయ ప్రాధాన్యం మరింత పెరిగింది. ఖమేనీ నివాసం, కార్యాలయ సముదాయాలపై జరిగిన భారీ దాడుల తర్వాత ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు ఇరాన్ అధికారులు చెబుతున్నప్పటికీ అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. ఇరాన్ విదేశాంగ మంత్రి ఆయన సురక్షితంగానే ఉన్నారని సంకేతాలు ఇచ్చినా అనుమానాలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ నసీర్‌జాదే, రెవల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మొహమ్మద్ పక్పూర్ మరణించినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి. అయితే ఈ విషయాన్ని ఇరాన్ అధికారికంగా ధ్రువీకరించలేదు. మొత్తం పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో పశ్చిమాసియా పరిస్థితి మరింత ప్రమాదకర దిశగా దూసుకెళ్తోంది. ప్రపంచ శాంతి, ఇంధన సరఫరా, భౌగోళిక రాజకీయ సమీకరణాలపై ఈ యుద్ధ ఉద్రిక్తతలు దీర్ఘకాల ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# వేట్లపాలెం విషాద విస్ఫోటం

తరలించారు. వారిలో పలువురికి 70 నుంచి 90 శాతానికి పైగా కాలిన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మంటలు విపరీతంగా ఎగిసిపడటం, ముడిసరకుల నిల్వలు భారీగా ఉండటంతో అగ్నిజ్వాలలు గంటల పాటు అదుపులోకి రాకపోవడం సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. ఘటన సమయంలో షెడ్లలో పనిచేస్తున్న కార్మికులు ఒక్కసారిగా మంటల మధ్య చిక్కుకుపోయి బయటకు రావడానికి వీలుకాలేదు. ఎగిసిపడుతున్న అగ్నిజ్వాలలు, దట్టమైన పొగ కారణంగా ఎంతమంది లోపల ఉన్నారో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. కళ్లముందే సహచరులు కాలిపోతున్నా వారిని రక్షించలేకపోయామని ప్రత్యక్ష సాక్షులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను కొంతవరకు అదుపులోకి తెచ్చిన తర్వాతే గాయపడిన వారిని గుర్తించి అంబులెన్సుల ద్వారా ఆసుపత్రులకు తరలించారు. పేలుడు తీవ్రతకు అక్కడ పనిచేస్తున్న పలువురి శరీర భాగాలు గాల్లో ఎగిరిపడి సమీప ప్రాంతాల్లో పడిపోయాయి. కొందరి మృతదేహాలు పూర్తిగా ఛిద్రమై మాంసపు ముద్దల్లా మారగా, మరికొన్ని శరీర భాగాలు చెట్లు, పొలాలు, కాలువల్లో పడినట్లు గుర్తించారు. ఒక మృతదేహం సుమారు యాభై మీటర్ల దూరంలో పంటకాలువలో పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలంలో కాళ్లు, చేతులు విడిపోయి చెల్లాచెదురుగా కనిపించడం అక్కడి భయానక పరిస్థితిని మరింత తీవ్రంగా చూపించింది. సుమారు ఎకరన్నర విస్తీర్ణంలో ఉన్న ఈ బాణసంచా తయారీ కేంద్రం పంట పొలాల మధ్య నిర్వహించబడుతోంది. ప్రమాదం తర్వాత మృతదేహాలు వివిధ ప్రదేశాల్లో చెల్లాచెదురుగా ఉండటంతో వాటిని సేకరించడానికే గంటల సమయం పట్టింది. కొందరు కార్మికులు ప్రాణాలను కాపాడుకునేందుకు పొలాల వైపు పరుగులు తీసినా తీవ్ర గాయాల కారణంగా అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం వరకు పొలాలు, కాలువలు, షెడ్లు అన్నీ వెతికి మృతదేహాలను ఒకచోట చేర్చిన తరువాతే మృతుల సంఖ్యపై స్పష్టత వచ్చింది. పేలుడు సంభవించిన సమయంలో వచ్చిన శబ్దం సమీప గ్రామాలను కుదిపేసింది. ఇళ్ల పైకప్పులు కంపించగా, పెంకులు ఎగిరిపడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఐదు కిలోమీటర్ల దూరంలోని సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల వరకూ పేలుడు శబ్దాలు వినిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పచ్చని పంట పొలాల మధ్య ఉన్న పరిశ్రమ ఒక్కసారిగా అగ్నికుండంలా మారడం స్థానికులను షాక్‌కు గురిచేసింది. సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ పేరుతో కొన్నేళ్లుగా ఈ బాణసంచా తయారీ కేంద్రం నడుస్తున్నట్లు సమాచారం. స్థానిక కార్మికులు టపాసుల తయారీ పనుల్లో నిమగ్నమై ఉండగా అనూహ్యంగా పేలుడు సంభవించింది. భారీగా నిల్వ ఉంచిన మందుగుండు పదార్థాలు ఒకేసారి పేలిపోవడంతో వరుస పేలుళ్లు చోటుచేసుకుని మంటలు వేగంగా వ్యాపించాయి. ఆ ప్రాంతం మొత్తం పొగమంచుతో కమ్ముకుపోవడంతో పరిస్థితి నియంత్రణలోకి రావడానికి ఎక్కువ



సమయం పట్టింది. తీవ్రంగా గాయపడిన తొమ్మిది మందిని కాకినాడ జీజీహెచ్‌లో ట్రామాకేర్, అత్యవసర విభాగాల్లో చికిత్స అందిస్తున్నారు. వారిలో ఎక్కువ మందికి 90 శాతానికి పైగా కాలిన గాయాలు ఉన్నాయని వైద్యులు వెల్లడించారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. బాధితుల కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఘటనపై సమాచారం అందుకున్న మంత్రి, ప్రజాప్రతినిధులు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ పరిస్థితిని సమీక్షించారు. ఘటన తీవ్రత దృష్ట్యా పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ విషాద ఘటన దేశవ్యాప్తంగా ఆవేదన కలిగించింది. ప్రధాని సహా పలువురు ప్రముఖులు మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. నిర్లక్ష్యం, భద్రతా లోపాలే ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వేడుకలకు వెలుగులు నింపాల్సిన బాణసంచా కర్మాగారం ఒక్కసారిగా మృత్యు విస్ఫోటంగా మారి ఎన్నో కుటుంబాల్లో ఆరని శోకాన్ని మిగిల్చింది.

# మార్చి 6 నుంచి 'ప్రజాపాలనప్రగతి' 99 రోజుల మిషన్

అర్హులైన ప్రజలకు చేరేలా ప్రతి శాఖ ఒకే లక్ష్యంతో పనిచేయాలని చెప్పారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వేగంగా పరిష్కరించడమే కాకుండా రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి కార్యాలయాల వరకు పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శాఖ, ప్రతి జిల్లా, ప్రతి అధికారి మిషన్ మోడ్‌లో పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమ పురోగతిని తాను స్వయంగా పర్యవేక్షిస్తానని, క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తానని తెలిపారు. అధికారుల పనితీరులో లోపాలు సహించబోమని హెచ్చరిస్తూ, ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముకలని పేర్కొన్నారు. ప్రతి పాలసీ విజయాపజయాలు వారి పనితీరుపైనే ఆధారపడి ఉంటాయని గుర్తుచేశారు. మార్చి 4న జరగనున్న కలెక్టర్ల సమావేశంలో అందరి పనితీరుపై సమగ్రంగా మాట్లాడతానని వెల్లడించారు. పరిపాలనలో ఆధునిక సాంకేతికత వినియోగాన్ని విస్తృతంగా పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజలు ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ సేవలు, పథకాలు పొందే విధంగా వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. విద్యుత్ మీటర్లు, గృహ నిర్మాణ అనుమతులు, నల్లా కనెక్షన్లు వంటి సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సులభమైన విధానాలను అమలు చేయాలని చెప్పారు. వాహన కొనుగోలు సమయంలోనే షోరూంలో రిజిస్ట్రేషన్ జరుగుతున్న విధానంలా ప్రతి విభాగంలో సంస్కరణలు తీసుకురావాలని సూచించారు. దరఖాస్తుదారు తన ఫైలు ఎక్కడ ఉందో తెలుసుకునే పారదర్శక వ్యవస్థ ఉండాలని సీఎం పేర్కొన్నారు. సమూల సాంకేతిక మార్పుల కోసం ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూడు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని కోరారు. ప్రతి శాఖలో డిజిటల్ గవర్నెన్స్ అమలు చేయడంతో పాటు పాత సర్వర్లను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అప్‌డేట్ చేయాలని సూచించారు. కేంద్రం నిర్వహించిన ఏఐ సమ్మిట్‌పై వచ్చిన విమర్శలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిందని సీఎం అన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా విభజించిన ప్రణాళికను గుర్తుచేస్తూ కోర్ అర్బన్ రీజియన్‌లో సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను కోరారు. ప్రతి ఐఏఎస్ అధికారి తమ శాఖలో ఉత్తమ కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేయాలని సూచించారు. ఉద్యోగుల డేటా సమగ్రంగా సిద్ధంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలు అన్ని శాఖల వద్ద సమగ్రంగా ఉండాలని ఆదేశించారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగకూడదని, ప్రతి శాఖకు సొంత భవనాలు ఏర్పాటు చేసేలా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగంలో శాఖలు అప్రమత్తంగా ఉండాలని సీఎం తెలిపారు. నిధులను సమర్థంగా వినియోగిస్తే అదనపు ప్రోత్సాహకాలు పొందే అవకాశం ఉందని గుర్తుచేశారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందే విధంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టాలని, అభివృద్ధిపై దీర్ఘకాలిక దృష్టి అవసరమని అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, మార్పు లక్ష్యాలతో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, రెండు సంవత్సరాలు మూడు నెలల కాలంలో ప్రజలు కోరుకున్న మార్పును స్వాగతిస్తున్నారని సీఎం పేర్కొన్నారు. వరుస ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన విషయాన్ని గుర్తుచేస్తూ ఇప్పటివరకు సాధించిన విజయాలను నిజాయితీగా సమీక్షించుకోవాలని అధికారులను సూచించారు. ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయో గుర్తించి సరిదిద్దుకోవాలని, మిగిలిన రెండేళ్లు తొమ్మిది నెలలకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

## నన్ను చంపడానికి ప్రయత్నించారు : మంత్రి వాకిటి

ఆయన వెల్లడించారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా వివిధ రకాలుగా అవమానాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో తనపై అనేక అభాండాలు మోపి తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి వాకిటి శ్రీహరి, జీవితంలో మరణం ఎప్పుడు వస్తుందో దేవుడే నిర్ణయిస్తాడని, చావుకు తాను భయపడనని స్పష్టంగా చెప్పారు. తనను చంపాలని పలుమార్లు ప్రయత్నాలు జరిగాయని పేర్కొంటూ, ఎన్ని కుట్రలు జరిగినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ధైర్యంగా వ్యాఖ్యానించారు. అవమానాలు, అపవాదులే తనను రాజకీయాల్లోకి నడిపించాయని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతే తన ప్రధాన ధ్యేయమని మంత్రి వివరించారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని, ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయాల కేంద్రబిందువని అన్నారు. ఎన్నికల సమయంలో తనపై జరిగిన తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మలేదని, మక్తల్ మున్సిపల్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. గత 72 సంవత్సరాల్లో 14 మంది ఎమ్మెల్యేలు కలిపి మక్తల్‌కు తీసుకువచ్చిన నిధులు రూ.296 కోట్లేనని, కానీ తాను కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రూ.1035 కోట్లకు పైగా నిధులు సమీకరించినట్లు వెల్లడించారు. అభివృద్ధి కోసం పనిచేసే వారిని ప్రశ్నించడం సహజమే కానీ అవమానించడం తగదని అన్నారు. ప్రాంతం ఎదగకుండా అడ్డంకులు సృష్టించినా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. తనపై నిరంతరం విమర్శలు, అవమానాలు, ఆరోపణలు వస్తున్నా వెనుకడుగు వేయబోనని మంత్రి స్పష్టం చేశారు. భయపడటం, బెదరడం తన స్వభావంలో లేదని, ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటానని చెప్పారు. రాజకీయ ఒత్తిడులు, అపవాదులు తన సంకల్పాన్ని మరింత బలపరుస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మక్తల్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. విద్య, సాగునీరు, మౌలిక సదుపాయాల రంగాల్లో సమగ్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానని అన్నారు. ప్రాంత ప్రజల ఆశలు నెరవేర్చే దిశగా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రజాసేవే తన మార్గమని మంత్రి వాకిటి శ్రీహరి మరోసారి స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసం, ఆశీస్సులే తనకు ధైర్యమని, అభివృద్ధి లక్ష్యంతో తన ప్రయాణం నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ దేశ ప్రతిష్టను దెబ్బతీస్తోంది: ప్రధాని మోదీ

జైపూర్/సనంద్: విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను దెబ్బతీయడానికి కాంగ్రెస్ ఎలాంటి అవకాశాన్నీ వదులుకోవడం లేదని ఆరోపించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు సందర్భంగా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలపడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచం ముందు భారత్ ప్రతిష్టను కించపరచే రాజకీయాలు తగవని హెచ్చరించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రస్తుతం తన అసలు సిద్ధాంతాల నుంచి దూరమైందని, విభజనాత్మక రాజకీయాల వైపు సాగుతోందని మోదీ వ్యాఖ్యానించారు. గతంలో దేశ విభజనకు దారితీసిన శక్తులతో పోల్చుతూ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ లాభాలకే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. మావోయిస్టు ధోరణుల మాదిరిగా వ్యవహరిస్తూ దేశానికి నష్టం కలిగించే రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. రాజస్తాన్ పర్యటనలో భాగంగా అజ్మీర్‌లో రూ.16,600 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజల ఆరోగ్యం, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి ప్రభుత్వ ప్రాధాన్యాల్లో భాగమని ఆయన తెలిపారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని, ప్రపంచ దేశాలు భారత్‌ను గౌరవంతో చూస్తున్న సమయంలో ప్రతి భారతీయుడికి గర్వంగా అనిపిస్తుందని అన్నారు.

## శుభపరిణామం: రేవంత్ నిర్ణయంపై హరీశ్ ప్రశంసలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఒక నిర్ణయంపై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. కోకాపేటలోని శారదాపీఠంకు కేటాయించిన భూములను తిరిగి పీఠానికే కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడంపై హరీశ్ రావు స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కోకాపేటలో శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించిన నిర్ణయాన్ని రద్దు చేయడం రాజ శ్యామలాదేవి అమ్మవారి కృపతో జరిగిన ధర్మ విజయమని, ఇది భక్తుల విజయమని పేర్కొన్నారు. ఆ అమ్మవారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరైన బుద్ధి ప్రసాదించారని అన్నారు. అదే సమయంలో, ఎలాంటి స్పష్టమైన ప్రజాప్రయోజన ప్రతిపాదిక లేకుండా పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తూ నామినేషన్ పద్ధతిలో మీ అల్లుడి అనుయాయులకి హెచ్ఎండీఏ ద్వారా కేటాయించిన 17 ఎకరాల భూమి సంగతి ఏమిటని హరీశ్ రావు ముఖ్యమంత్రిని నిలదీశారు. ఆ భూమిలో కొనసాగుతున్న క్రషర్ యూనిట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకునే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

## ఫార్ములా-ఈ కేసులో సంచలనం అర్వింద్‌కుమార్ సస్పెన్షన్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 : ఫార్ములా–ఈ రేసు కేసు దర్యాప్తులో కీలక మలుపు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ అప్రూవర్‌గా మారేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం వెలువడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేయడంతో కేసు దర్యాప్తుకు ఉన్న పరిపాలనా అడ్డంకులు తొలగిపోయినట్లు భావిస్తున్నారు. దీంతో అభియోగపత్రం దాఖలు ప్రక్రియ వేగం అందుకుంది. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు అర్వింద్‌కుమార్, పదవీ విరమణ చేసిన మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి మరియు మరికొందరిని నిందితుల జాబితాలో చేర్చేందుకు ఏసీబీ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో కీలక ఆధారాలు, వాంగ్మూలాలు సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే, తనపై నమోదైన అభియోగాల నుంచి బయటపడేందుకు అర్వింద్‌కుమార్ అప్రూవర్‌గా మారాలని వివిధ మార్గాల ద్వారా ఏసీబీ ఉన్నతాధికారులను సంప్రదించినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామం కేసు దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై అభియోగాల నమోదుకు గవర్నర్ అనుమతి లభించడం, అనంతరం అర్వింద్‌కుమార్‌పై ప్రాసిక్యూషన్‌కు కేంద్ర డీఓపీటీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం దర్యాప్తు వేగాన్ని మరింత పెంచింది. దీంతో చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసి త్వరలోనే కోర్టులో ఛార్జిషీట్ సమర్పించేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ వ్యవహారాన్ని మనీలాండరింగ్ కోణంలో పరిశీలించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈసీఐఆర్ నమోదు చేసి తన విచారణను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఏసీబీ అభియోగపత్రం అనంతరం ఈడీ కూడా ప్రత్యేకంగా కోర్టులో తన ఛార్జిషీట్‌ను దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఫార్ములా–ఈ రేసు కేసు రాజకీయంగా, పరిపాలనా పరంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో అర్వింద్‌కుమార్ అప్రూవర్‌గా మారుతారా? లేదా న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగిస్తారా? అన్న ప్రశ్నలకు త్వరలోనే స్పష్టత రానుంది. మొత్తానికి ఈ కేసు తదుపరి పరిణామాలపై రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది.

# పోస్ట్‌మార్టం రిపోర్ట్ అందించాలంటే

# రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్

### రూ. 35 వేలు లంచం

### తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ హోంగార్డ్ నగేష్






**కీసర, ఫిబ్రవరి 28,(అక్షర గళం) :** రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడుతున్నారు.మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం దాడులు నిర్వహించి హోంగార్డ్ నగేష్‌ను లంచం తీసుకుంటూ పట్టుకున్నారు.మృతుడు తోటకూర మహేష్ పోస్ట్‌మార్టం రిపోర్ట్ అందించాలంటే మొదట రూ.2 లక్షలు ఇవ్వాలని నగేష్ డిమాండ్ చేసినట్లు మృతుడి మేనల్లుడు శరత్ ఆరోపించారు. గాంధీ ఆసుపత్రి డాక్టర్.సందీప్ పేరు చెప్పి రిపోర్ట్ త్వరగా తెప్పించాలంటే డబ్బులు అవసరమని నమ్మబలికినట్లు తెలిపారు.నెలలు గడిచినా రిపోర్ట్ అందకపోవడంతో చివరకు రూ.40 వేలుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. మొదట రూ.5 వేలు తీసుకున్న నగేష్, రెండో విడతగా రూ.35 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది.తోటకూర మహేష్ మృతి చెందిన నాలుగు నెలలు గడిచినా పోస్ట్‌మార్టం రిపోర్ట్ ఇవ్వలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.నగేష్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తామని తెలిపారు.



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన యాదిలాల్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 28 (అక్షర గళం):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డిని ఆమనగలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ శనివారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని అలంపూర్ నుంచి సెక్రటేరియట్ వరకు న్యాయవాదులు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం సెక్రటేరియట్లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని న్యాయవాదుల బృందం కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని యదిలాల్ తెలిపారు.



## మహేందర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన వైఎస్ఆర్సిపి నాయకులు కట్ట వెంకటేష్ . అక్కిసాయిలు వెంకటయ్య

**కల్వకుర్తి ఫిబ్రవరి 28 (అక్షరగళం) :** చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన వనం మహేందర్ కొద్దిరోజు క్రితం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కింద పడ్డారు విషయం తెలుసుకున్న చారకొండ మండల వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు మహేందర్ కుటుంబానికి 5000 ఆర్థిక సాయం అందజేసిన వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు కట్ట వెంకటేష్ ఈ కార్యక్రమంలో చారకొండ మండల వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు కట్ట వెంకట్ గౌడ్ వైఎస్ఆర్సిపి గ్రామ అధ్యక్షుడు సాయిలు. వెంకటయ్య



## డ్వాక్రా భవన నిర్మాణానికి భూమిపూజ

**యాచారం, అక్షరగళం :-** మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో డ్వాక్రా భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ సభావత్ కిషన్ నాయక్, ఉపసర్పంచ్ రవి గౌడ్ తో కలసి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. డ్వాక్రా భవనం కొరకు 10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు లావణ్య, లక్ష్మమ్మ, శివాని, శేఖర్, జంగయ్య, వెంకటేష్, యాదమ్మ, రాజు, వినోద్, ఏపీఎం, మహిళ సంఘాల సభ్యులు తదితరులున్నారు.



## టైలర్లను ప్రభుత్వాలు ఆదుకోవాలి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 28 (అక్షర గళం):** కులవృత్తిపై ఆధారపడిన టైలర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందించి ఆదుకోవాలని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము కోరారు. ప్రపంచ టైలర్స్ డేను శనివారం పట్టణ కేంద్రంలో ఆమనగల్లు టైలర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరై కుట్టు మిషన్ రూపకర్త విలియమ్స్ హో చిత్రపటానికి కుల వృత్తి దారులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేరకుల వృత్తి దారులను ఆదుకునేలా సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, పథకాలు అమలు చేయాలని కోరారు. టైలర్స్ సంఘం అధ్యక్షులు చాత సాయిబాబా, ఉపాధ్యక్షులు పున్న శ్రీను, టైలర్స్ బిక్షపతి, కొమ్ము నర్సింహా, దేవి, శారద, సుధాకర్, మాధవి, పురేందర్, మల్లేష్, యాద గిరి, గంజి శ్రీను, నర్సోజి, గంజి నర్సింహా, జమ్లా నాయక్, ఏలే యాదగిరి, లక్ష్మయ్య, రాజు నాయక్, శివలింగం, పెద్దయ్య, ఈశ్వర్, ఉమ్లా నాయక్, కృష్ణ, షకీల్, రమేష్, మహేష్, సాలయ్య నాయకులు శ్రీను నాయక్, సైదులు గౌడ్, నరేష్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 28 (అక్షర గళం):** కల్వకుర్తి నియోజకవర్గంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం అమనగల్లు మున్సిపాలిటీలో 12,13 వార్డులలో ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కమిషనర్ శంకర్ నాయక్,చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్మన్ గీత, కౌన్సిలర్లతో కలిసి హైమాస్ట్ లైట్లను స్విచ్ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధి మరింత కృషి చేస్తానన్నారు. పట్టణంలోని ప్రజలకు భద్రతతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో రాత్రి వేళల్లో వెలుతురు సమస్య పూర్తిగా తొలగిపోతుందని పేర్కొన్నారు. కౌన్సిలర్స్ నాగిళ్ళ జగన్, అనూష శ్రీశైలం, ఎర్రవోలు మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, నాయకులు గుర్రంకేశవులు, అప్పం శ్రీనివాస్,కాలే మల్లయ్య, కృష్ణ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, మానయ్య, పూసలి సత్యం, కుమార్ గౌడ్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

**ఆమనగల్లు, ఫిబ్రవరి 28 (అక్షర గళం):** కడ్తాల్ మండల కేంద్రంలోని పెద్ద వేములోని భావి తండాకు చెందిన రమావత్ సక్రు నాయక్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. తండా మాజీ సర్పంచ్ శ్వేతా భూనాథ్ నాయక్ సమాచారం తెలుసుకున్న లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కడ్తాల్ మండల మాజీ జడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ శనివారం మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నుండి రమావత్ సక్రు నాయక్ కుటుంబానికి 5 వేల రూపాయలు, స్థానిక సర్పంచ్ గోపి నాయక్ 4000 రూపాయలను సమకూర్చి 9 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో మైసిగండి సర్పంచ్ ప్రేమ జోహార్ లాల్ నాయక్, మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్, ఉపసర్పంచ్ గోపాల్ నాయక్ నాయకులు లక్ష్మణ్, మోహన్, నరేష్, శ్రీకాంత్, శివ, గోపాల్, రాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుంది

### టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

**అక్షర గళం , కూకట్‌పల్లి :** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు .శనివారం పైన స్థానిక పార్టీ నాయకులతో కలిసి కెపిహెచ్బి కాలనీ మూడో పేస్ లోని బతుకమ్మ కుంట ను పరిశీలించారు ఇక్కడ వాకింగ్, స్కేటింగ్, ఓపెన్ జిమ్ కు వచ్చే వారి వాహనాల పార్కింగ్ విషయమై సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో రమేష్ బతుకమ్మ కుంట ను సందర్శించారు. మరోవైపు ఎక్కడ టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో ఇక్కడికి వచ్చే వారికి, బయట రహదారులపై వాహనాలు పార్కింగ్ చేయడంతో స్థానికులకు ఇబ్బందికరంగా తయారయింది ఈ మేరకు పార్కును సందర్శించిన రమేష్ గారు వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు వెంటనే వాహనాల పార్కింగ్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఫణీంద్ర, రంగమోహన్, పిడికిటి గోపాల్ చౌదరి, అరవింద్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ సైన్స్ డే

**కల్వకుర్తి ఫిబ్రవరి 28 (అక్షరగళం) :** కల్వకుర్తి పట్టణంలోని వివిధ పాఠశాలలో ఆయా ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సైన్స్ ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేలా రూపొందించిన ఆవిష్కరణలు, ప్రాజెక్టులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ పచ్చిపన స్కూల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బచ్పన్ స్కూల్లో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ సందర్శించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు కొండంత అండ

### ::: సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్

**యాచారం, అక్షరగళం :-** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు కొండంత అండ అని మేడిపల్లి నక్కర్త సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు. గ్రామానికి చెందిన మోటే స్వాతి అనారోగ్యంతో బాధపడుతూ.. వైద్య ఖర్చుల నిమిత్తం కొరకు ముఖ్యమంత్రి సహాయానిధికి దరఖాస్తూ చేసుకోగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజురైనా 2 లక్షల 50 వేల ఎల్ఓసిని శనివారం బాధితురాలికి ఉపసర్పంచ్ దెంది మధుకర్ రెడ్డితో కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి ఏదో రూపకంగా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాధవి, మమత, పద్మ, జ్యోతి, కళమ్మ, మహేష్, జంగయ్య, మల్లేష్, కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ నాగార్జుననగర్‌కాలనీలో భారీ చోరీ



### ::: 40 తులాల బంగారం, వెండి, నగదు అపహరణ

**కుషాయిగూడ, ఫిబ్రవరి 28,(అక్షర గళం) :** కుషాయిగూడ ప్రాంతంలో ఒక ఇంట్లో భారీ దొంగతనం జరిగిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు ఎటువంటి గీతలు లేకుండా తెరిచి బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్లాట్ నెం. 176 & 177/ాలో నివసించే జె. ఆనంద్ గుప్తా (55), వ్యాపారవేత్త, శుక్రవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదులో పేర్కొన్నదేమనగా, అదే రోజు మధ్యాహ్నం సుమారు 12 గంటలకు తన కుటుంబ సభ్యులతో కలిసి కుషాయిగూడలో జరిగే కుటుంబ కార్యక్రమానికి హాజరు కావడానికి ఇంటికి తాళం వేసి వెళ్లినట్లు తెలిపారు. సుమారు సాయంత్రం 4.20 గంటల సమయంలో ఫిర్యాదుదారుని అల్లుడు మణికంఠ ఇంటికి వచ్చి చూడగా, ప్రధాన తలుపు తాళం ఎటువంటి పగుళ్లు లేకుండా తెరవబడి ఉన్నట్లు గమనించాడు. అనుమానం రావడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడివున్నట్లు గుర్తించాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి, అందుబాటులో ఉన్న తాళాలను ఉపయోగించి సుమారు 40 తులాల బంగారు ఆభరణాలు, 3.7 కిలోల వెండి వస్తువులు మరియు రూ.2.45 లక్షల నగదును దొంగిలించి పరారైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, సీసీ కెమెరా ఫుటేజ్ సేకరణతో పాటు ఆధారాల కోసం పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

# ఈసీఐఎల్ సంస్థలో "స్వచ్ఛతా హి సేవ 2026"

### మెగా శ్రమదాన్లో ఉత్సాహభరితమైన పాల్గొన్న ఉద్యోగులు
### ఈసీఐఎల్ సంస్థలోని వివిధ ప్రాంతాలలో పరిశుభ్రత
### పారిశుధ్య కార్మికుల కోసం అవగాహన వర్క్షాప్ తో పాటు వైద్య శిబిరం






కుషాయిగూడ,ఫిబ్రవరి 28, (అక్షరగళం) : ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) నిర్వహిస్తున్న "స్వచ్ఛతా హి సేవ 2026" ప్రచారం భారత ప్రభుత్వం, అణుశక్తి శాఖ (డిఏఈ) సూచనలకు అనుగుణంగా ఫిబ్రవరి 16 నుండి 28 వరకు స్వచ్ఛత పఖ్వాడా 2026ను విజయవంతంగా ముగించింది.పక్షం రోజుల పాటు జరిగిన ఈ ప్రచారం సంస్థ అంతటా పరిశుభ్రత, పారిశుధ్యం మరియు స్థిరమైన పరిశుభ్రత పద్ధతుల ప్రాముఖ్యతను బలోపేతం చేసింది. అన్ని విభాగాలలోని ఉద్యోగులు సామూహిక స్వచ్ఛత ప్రతిజ్ఞతో ఈ డ్రైవ్ ప్రారంభమైంది. ఈసీఐఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డా.అనీష్ కుమార్ శర్మ ఈ కార్యచరణాన్ని ప్రారంభించారు.తద్వారా ఉద్యోగులు సామూహిక స్వచ్ఛతా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఈసీఐఎల్ సంస్థలోని వివిధ ప్రాంతాలలో పరిశుభ్రత, పారిశుధ్యం పట్ల ఉద్యోగులను చైతన్యవంతం చేయడానికి అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేయబడ్డాయి. మెరుగైన ఆరోగ్య పద్ధతులను ప్రోత్సహించడానికి పారిశుధ్య కార్మికుల కోసం అవగాహన వర్క్షాప్ తో పాటు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అదనంగా వ్యక్తిగత రక్షణ పరికరాలు పిపిఈ కిట్లను పంపిణీ చేశారు.సమగ్ర శుభ్రపరిచే డ్రైవ్‌లు మరియు మెగా శ్రమదాన్లో ఉత్సాహభరితమైన ఉద్యోగులు








పాల్గొన్నారు,ఈ సందర్భంగా దివ్యాంగులకు అనుకూలమైన టాయిలెట్లు చేరికను పెంచడానికి పునరుద్ధరించబడ్డాయి. జాతీయ సైన్స్ దినోత్సవంతో పాటు ఫిబ్రవరి 28న జరిగిన ముగింపు కార్యక్రమంలో, పోటీ విజేతలు మరియు ఆదర్శప్రాయమైన పరిశుభ్రతకు గుర్తింపు పొందిన విభాగాలకు అవార్డులు ప్రదానం అందజేశారు.ఈ కార్యక్రమం లో డైరెక్టర్ టెక్నికల్, పీకే చక్రబోర్తీ డైరెక్టర్ (ఫైనాన్స్) ఈసీఐఎల్ ఆఫీసర్లు, కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయం

### ::: మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్







కల్వకుర్తి ఫిబ్రవరి 28 (అక్షరగళం) : కల్వకుర్తి పట్టణంలోని నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.పట్టణ అభివృద్ధిలో భాగంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. పట్టణంలోని ఫస్ట్ అండ్ ఎదురుగా ఉన్న ఎస్సీ కాంప్లెక్స్ వ్యాపార సముదాయం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందన్నారు. ప్రస్తుతం సిద్ధంగా ఉన్న వ్యాపార షట్టర్లను వెంటనే అర్హులైన వారికి కేటాయించాలని నిర్ణయించారు. దీంతో పాటు, మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో అదే సముదాయంలో మరిన్ని నూతన షట్టర్లను నిర్మించాలని ప్రతిపాదించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. నూతన షట్టర్ల నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూరుస్తామని వారు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.






# క్రీడలు మానసిక ఉల్లాసం,మంచి ఆరోగ్యం కలుగజేస్తాయి

### మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ
### బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

కల్వకుర్తి ఫిబ్రవరి 28 (అక్షర గళం) : క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం చేస్తే అని మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామంలో జెడ్ పి హెచ్ ఎస్ గ్రామంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డితో కలిసి పాల్గొన్న సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాకారుడు స్వర్గీ య సదా అమృత లింగం మొదటి వర్ధంతి సందర్భంగా టోర్నమెంట్ ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన క్రీడాకారుడు అమృతం లింగంగారని చిన్న వయసులోనే అకాల మరణం చెందడం ఎంతో బాధాకర ఉన్నారు. సదా అమృత లింగం స్ఫూర్తితో యువకులు గొప్ప స్థాయి చేరుకోవాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు. సమావేశంలో బిజెపి నాయకులు , కార్యకర్తలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు



## సీఎం సహాయనిధి నిరు పేదలకు గొప్పవరం

### ::: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : సీఎం సహాయనిధి నిరు పేదలకు గొప్పవరమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 283 డివిజన్ బి .జె .ఆర్ నగర్ వాసులు ఎం.డి నూర్జహాన్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతుంది, చికిత్సకి సరిపడ్డ డబ్బులు లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 1,75,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 1,75,000 సీఎం ఆర్ఎఫ్ ఎల్ ఓసీ మంజూరి పత్రాలను ఎం.డి నూర్జహాన్ కు శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టైలర్స్ డే దినోత్సవం

కల్వకుర్తి ఫిబ్రవరి 28 (అక్షరగళం) : కల్వకుర్తి పట్టణంలో ఘనంగా ప్రపంచ టైలర్స్ దినోత్సవం వేడుకలను టైలర్ షాప్ యజమానులు,వర్కర్స్, శనివారం జరుపుకున్నారు.ముఖ్య అతిథులుగా కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల,వైస్ చైర్పర్సన్ శనవాజ్ ఖాన్, 18 వ వార్డు కౌన్సిలర్ ఎండి నాజియా మక్బుల్,వార్డు కౌన్సిలర్ రాము నాయక్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాట్లాడుతూ టైలర్స్ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా దేశంలో 1819 జన్మించిన విలియమ్స్ అతి చిన్న వయసులోనే 1845 కుట్టు మిషన్ రూపొందించి ఫిబ్రవరి 28న ప్రపంచానికి అందించాలని గుర్తు చేశారు. ఈ వృత్తి పైన ఎన్నో కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు.కుట్టు మిషన్ రూపొందించిన విలియమ్స్ ను గుర్తు చేసుకునే విధంగా టైలర్స్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ బృంగి రత్నమాల,వైస్ చైర్పర్సన్ శనవాజ్ ఖాన్,వార్డు కౌన్సిలర్లు నాజియా,రాము నాయక్ లను శాల్వాలతో సన్మానించారు.వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు టైలర్స్ అసోసియేషన్ బిల్డింగు కంప్లీట్ చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ సంఘం అధ్యక్షులు ఎస్కే వహీద్, టైలర్ బోడపాండయ్య, సలీంఖాన్, టైలర్ అసోసియేషన్ సభ్యులు, వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన బిజెపి సీనియర్ నాయకులు చిందం కృష్ణయ్య




కల్వకుర్తి ఫిబ్రవరి 28 (అక్షరగళం): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని శనివారం బిజెపి సీనియర్ నాయకులు వెల్దండ మాజీ సర్పంచ్ న్యాయవాది లక్ష్మీ చిందం కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశాను. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం దృష్టికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

## రికార్డు స్థాయిలో ఆర్టీసీ టెండర్‌కు నెలకు అద్దే పదిలక్షల ఐదువేల ఒక వంద

### అవాకైనా వ్యాపారులు.. టెండర్లలో ఆర్టీసీకి భారీ ఆదాయం

కల్వకుర్తి ఫిబ్రవరి 28 (అక్షర గళం ): మహబూబ్నగర్లో రివిజన్ పరిధిలోని ఆయా డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్లలోని ఖాళీ స్థలాలు పక్కా స్టాల్స్కు టెండర్లను శనివారం మహబూబ్నగర్ రివిజన్ లోని జరిగిన టెండర్లలో వ్యాపారస్తులు పాల్గొన్నారు. మహబూబ్నగర్ రివిజన్ పరిధిలోని ఆయా బస్టాండ్లలో ఉన్న ఖాళీ స్థలాలకు పక్కా స్టాళ్లకు వ్యాపారస్తుల మధ్య పోటాపోటీ కొనసాగడంతో ఆర్టీసీ కి భారీ ఆదాయం సమకూరింది అయితే కల్వకుర్తి డిపో పరిధిలోని కల్వకుర్తి బస్ స్టేషన్లలో ఉన్న ఖాళీ పక్కా స్థలాలకు సంబంధించి ఓ వ్యాపారి ఖాళీ స్థలానికి సంబంధించి షాప్ నెంబర్ 26 కు డైరీ పార్లర్ కు ఏకంగా అక్షరాల పదిలక్షల 5000 ఒక వంద రూపాయల కోడ్ చేసి వేశారు ఆర్టీసీ టెండర్ కమిటీ ఆధ్వర్యంలో టెండర్లు ఓపెన్ చేశారు వ్యాపారస్తులు వేసిన నెలకు అద్దె అధికారులు చదువుతుండడంతో కల్వకుర్తికి చెందిన వ్యాపారి నెలకు చెల్లించిన చూసి వ్యాపారస్తులు అంత అవాక్కయ్యారు. అదేవిధంగా కల్వకుర్తి ఖాళీ స్థలాలకు పక్కా స్టాళ్లకు నిర్వహించిన టెండర్లలో వ్యాపారస్తులు పోటా పోటీగా ఖాళీ స్థలాలు 25, 26 50వేలకు పైకి మించి టెండర్లు వేయడంతో కల్వకుర్తిలో చర్చంచనియంగా మారింది అయితే 20 ఏండ్ల డి ఓ టి షాపులు మరో నాలుగు నెలలలో గడువు ముగుస్తుండడంతో ఈ అద్దెను చూసిన డి ఓ టి షాపు వ్యాపారస్తులలో గుండెల్లో రైలు పరిగెడుతున్నాయి ఇవేమి కిరాయిలు రా బాబు అని నెత్తి నెత్తి వాదుకుంటున్నారు. ఈ అద్దెలను చూసి అవాకైతున్నారు. అదేవిధంగా పాప్కాన్ షాప్ కు 47000 రెండవ టెండర్ లో 38,000 వేశారు మొత్తం మీద కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు భారీ అద్దె రూపంలో సమకూరినట్లు అయింది .



## కాఫీ & టీ " హోటల్ ప్రారంభం

అక్షరగళం, కూకట్ పల్లి : కూకట్పల్లి నియోజకవర్గం హౌసింగ్ బోర్డు కాలనీ ధర్మా రెడ్డి కాలనీ మండల రెవెన్యూ ఆఫీస్ పక్కన మదన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన "అమ్మ కాఫీ & టీ " హోటల్ ను టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ తో కలిసి కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు పాల్గొని ప్రారంభించారు



# యాపిల్.. భారత్‌లో ప్లాంట్లు నిర్మించుకోవచ్చు!

## అక్కడ తయారైన ఉత్పత్తులు అమెరికాలో విక్రయించాలంటే సుంకాలు చెల్లించాల్సిందే

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్: యాపిల్ తన ప్లాంట్లను నిర్మించడానికి భారత్‌కు వెళ్లొచ్చని, కానీ ఆ టెక్ కంపెనీ సుంకాలు లేకుండా అమెరికాలో తన ఉత్పత్తులను విక్రయించడానికి వీలుండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా అణుశక్తిని పెంచడానికి ఓవల్ కార్యాలయంలో బహుళ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'టిమ్ కుక్ యాపిల్ ప్లాంట్లు నిర్మించడానికి భారతదేశానికి వెళ్తున్నానని నాతో అన్నారు. అక్కడకు వెళ్లడం ఫర్వాలేదు కానీ సుంకాలు లేకుండా ఇక్కడ ఆ ఉత్పత్తులను విక్రయించడం కుదరదని చెప్పాన'ని ట్రంప్ వెల్లడించారు. ఐఫోన్లను అమెరికాలో సుంకాలు లేకుండా విక్రయించుకోవాలంటే ఇక్కడే ఉత్పత్తి చేయాలని నేను ప్రతిపాదించానని తెలిపారు. దీనికి యాపిల్ సుముఖంగా లేకపోతే 25 శాతం సుంకాలు చెల్లించి ఇక్కడ ఉత్పత్తులను విక్రయించుకోవాల్సి ఉంటుందని వివరించారు.


**భారత్‌లో చౌకగానే..:** భారత్‌లో తయారయ్యే ఐఫోన్లపై అమెరికా సుంకాలు విధించినప్పటికీ మన దేశంలో ఐఫోన్ల తయారీ ఖర్చు అమెరికాలో కంటే తక్కువే అవుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) తన నివేదికలో వెల్లడించింది. భారత్‌లో తక్కువ ఉత్పత్తి వ్యయాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటివి దీనికి దోహదం చేస్తాయని పేర్కొంది.

**జీటీఆర్ఐ నివేదిక ప్రకారం..:** భారత్‌లో ఒక ఐఫోన్ అసెంబ్లింగ్ ఖర్చు సుమారు 30 డాలర్లు కాగా, అమెరికాలో 390 డాలర్లు వెచ్చించాల్సి ఉంటుంది. భారత్‌లో కార్మికుల జీతాలు తక్కువగా ఉండటమే దీనికి కారణం. మన దేశంలో ఒక కార్మికుడికి నెల సంపాదన సగటున 230 డాలర్లు (రూ. 19,000). అదే అమెరికాలో కనీస వేతన చట్టాల ప్రకారం ఈ సంపాదన 2,900 డాలర్ల (రూ. 2.4 లక్షలు) వరకు ఉంటుంది .



# ఆ ఒక్క రాష్ట్రంలోనే ఐదు లక్షల కార్లు: డేటా..

సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ తయారీదారుల (SIAM) డేటా ప్రకారం.. 2024-25లో భారతదేశంలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలలో 'మహారాష్ట్ర' మొదటి స్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్ ద్విచక్ర వాహనాల అమ్మకాలలో ముందుంది. డేటా ప్రకారం.. 2024-25లో మహారాష్ట్రలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 5,06,254 యూనిట్లు (11.8 శాతం)గా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ 4,55,530 యూనిట్లు (10.6 శాతం), గుజరాత్ 3,54,054 యూనిట్లు (8.2 శాతం) అమ్మకాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత నాల్గవ స్థానంలో కర్ణాటక 3,09,464 యూనిట్లతో (7.2 శాతం), హర్యానా 2,94,331 యూనిట్లతో (6.8 శాతం) ఐదవ స్థానంలో ఉన్నాయి. ద్విచక్ర వాహన విభాగంలో.. ఉత్తరప్రదేశ్ 28,43,410 యూనిట్ల అమ్మకాలతో (14.5 శాతం వాటా) అగ్రస్థానంలో ఉంది. మహారాష్ట్ర 20,91,250 యూనిట్లతో (10.7 శాతం), తమిళనాడు 14,81,511 యూనిట్లతో (7.6 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. నాలుగు, ఐదు స్థానాల్లో కర్ణాటక (12,94,582 యూనిట్ల), గుజరాత్ (12,90,588 యూనిట్లు) ఉన్నాయి. త్రిచక్ర వాహనాల విభాగంలో.. ఉత్తరప్రదేశ్ అత్యధికంగా 93,865 యూనిట్లు (12.7 శాతం) అమ్మకాలు జరపగా, గుజరాత్ 83,947 యూనిట్లు (11.3 శాతం), మహారాష్ట్ర 83,718 యూనిట్లు (11.3 శాతం) అమ్మకాలు జరిపాయని డేటా తెలిపింది. కర్ణాటక 70,417 యూనిట్లతో (9.5 శాతం) నాల్గవ స్థానంలో, బీహార్ 47,786 యూనిట్లతో (6.4 శాతం) ఐదవ స్థానంలో నిలిచాయి.



# చమురులో భారత్ తర్వాతే చైనా!

గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయ చమురు గిరాకీ వృద్ధిని చైనానే ముందుండి నడిపించింది. వచ్చే దశాబ్దంలో మాత్రం భారత్ ఆ పనిచేస్తుందని మూడీస్ రేటింగ్స్ తన తాజా నివేదికలో పేర్కొంది. ప్రపంచ చమురు వినియోగదారుల్లో చైనా, భారత్ వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ రెండు దేశాల్లో గిరాకీ వృద్ధి విషయంలో అంతరాలున్నాయని తెలిపింది. మూడీస్ ఇంకా ఏమంటోందంటే..గిరాకీ వృద్ధి, దిగుమతిపై ఆధారపడడం భారత్‌లో ఎక్కువగా ఉండబోతోంది. చైనాతో పోలిస్తే వచ్చే దశాబ్దంలో భారత్‌లోనే గిరాకీ వృద్ధి వేగంగా ఉండనుంది. చైనా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడడం, అదే సమయంలో విద్యుత్ వాహనాల(ఈవీ) వ్యాప్తి ఆ దేశంలో ఎక్కువ కావడంతో అక్కడ చమురుకు గిరాకీ తగ్గనుంది. చైనాలో వచ్చే 3-5 ఏళ్లలో చమురు వినియోగం గరిష్ఠ స్థాయికి చేరొచ్చు. అదే సమయంలో భారత్‌లో 3-5 శాతం వార్షిక వృద్ధి నమోదు కావొచ్చు.

**ఇరు దేశాల మధ్య తేడా అదే..**

రెండు దేశాలూ చమురు-గ్యాస్‌పై భారీగా ఆధారపడ్డవే అయినా.. చమురు దిగుమతులపై చైనా ఆధారపడడం తగ్గుతుంది. దేశీయంగా ఉత్పత్తి పెరగడం, అనిశ్చితుల మధ్య గిరాకీ తగ్గడం ఇందుకు నేపథ్యం. ముఖ్యంగా చైనా జాతీయ చమురు కంపెనీ(ఎన్‌ఓసీ)లు.. భారత చమురు కంపెనీలతో పోలిస్తే వచ్చే 3-5 ఏళ్లలో ఉత్పత్తి వృద్ధిలో ముందు ఉండనున్నాయి. చైనా ఎన్‌ఓసీలు తవ్వకం, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇక రిఫైనింగ్, పెట్రోరసాయనాల రంగాల్లో చాలా వరకు ప్రాజెక్టులు పూర్తి కావడంతో ఆ రంగంలో పెట్టుబడులు తగ్గనున్నాయి. కానీ భారత్‌లో మాత్రం ఇంకా రిఫైనింగ్, పెట్రోరసాయనాల ప్లాంట్లపై వచ్చే అయిదేళ్ల పాటు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి రావొచ్చు. దేశీయ చమురు-గ్యాస్ ఉత్పత్తిపై భారత ఎన్‌ఓసీల ప్రణాళికలు బాగున్నా.. అమలు జరగాల్సి ఉంది. భారత్‌లో కర్బన నియంత్రణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. చైనాతో పోలిస్తే భారత ఎన్‌ఓసీలకు హరిత సాంకేతికతలపై పెట్టుబడుల విషయంలో తక్కువ ఒత్తిడి ఉంది. అదే చైనాలో హరిత విధానాల విషయంలో కఠిన నిబంధనలు ఉన్నాయి.

**డ్రాగన్ దేశంలో గిరాకీ పరిస్థితి ఇలా..**

చైనాలో చమురు గిరాకీ 2030 కల్లా ఏటా 800 మిలియన్ టన్నుల వరకు చేరొచ్చు. ఆర్థిక వృద్ధి మందగమనానికి తోడు ఆ దేశం స్వచ్ఛ ఇంధనం వైపు మళ్లుతుండడంతో చమురు గిరాకీ వృద్ధిపై ప్రభావం పడతనుంది. ఈవీలు, పునరుత్పాదక ఇంధనంపై దృష్టి కారణంగా డీజిల్, పెట్రోలుపై ఆధారపడడం తగ్గవచ్చు. అయితే విమాన ఇంధనం, నాఫ్తా వినియోగం పెరిగే అవకాశం ఉంది. రిఫైనింగ్ సామర్థ్యం సైతం 1 బిలియన్ టన్నులకు చైనా పరిమితం చేసింది.

**మన దేశంలో..**

భారత్ తన రిఫైనింగ్ సామర్థ్యాన్ని 2030 కల్లా ఏటా 309 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేర్చుకోవాలని భావిస్తోంది. ఏప్రిల్ 1, 2024 నాటికి 256.8 మి. మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉంది. ఆర్థిక వృద్ధి రాణిస్తుండడం, పారిశ్రామికీకరణ, మౌలిక రంగంపై భారీ పెట్టుబడులు తదితరాల వల్ల భారత్‌లో రవాణా ఇంధనాల్లో గిరాకీ వృద్ధి పెరగనుంది. ఇక భారత చమురు మార్కెటింగ్ కంపెనీలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్‌లు ఇటీవలి సంవత్సరాల్లో రిఫైనింగ్ సామర్థ్యాల పెంపు కోసం భారీ పెట్టుబడులు పెట్టాయి.

**సహజ వాయువు విషయంలోనూ..**

ఇక గ్యాస్ గిరాకీ వృద్ధి విషయంలోనూ చైనాతో పోలిస్తే భారత్‌లోనే కాస్త అధికంగా నమోదు కావొచ్చు. భారత్ తన ఇంధనాల్లో సహజ వాయువు వాటాను ప్రస్తుత 6 శాతం నుంచి 2030 కల్లా 15 శాతానికి చేర్చుకోవాలని భావిస్తోంది. ఎరువులు, పెట్రోరసాయనాల వంటి పారిశ్రామిక రంగాల విస్తరణకు తోడు, పట్టణ-పాక్షిక పట్టణ ప్రాంతాల్లో సహజ వాయువు వినియోగం పెరుగుతుండడంతో 2030 కల్లా ఏటా 4-7 శాతం మేర గిరాకీ వృద్ధి నమోదు కావొచ్చు.

## జపాన్‌ను అధిగమించి..నాలుగో ఆర్థిక శక్తిగా భారత్: నీతి ఆయోగ్ సీఈఓ

ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. పదో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి చర్యలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారత చాలా కీలకమన్నారు. మరోవైపు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇదే విషయాన్ని 'ఎక్స్' వేదికగా తెలిపారు. వికసిత్ భారత్ వైపు ఇది అతిపెద్ద అడుగు అని పేర్కొన్నారు. దీన్ని సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లలోనే భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహతహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితో పాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరిపై జీఎస్టీని ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

# ఎఫ్‌ఐఐల 5 వేల కోట్ల వెనక్కి


## గతవారంలో తరలించుకుపోయిన విదేశీ ఇన్వెస్టర్లు

న్యూఢిల్లీ, : దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి రూ.4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్‌ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఐదు సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర



ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకేరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్‌ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్‌ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్‌ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

# జమ్ము్మకశ్మీర్ రీ-ఆర్గనైజేషన్ బిల్లు..
# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు సాధ్యమేనా?



**మొన్న కేంద్ర హెూం శాఖామాత్యులు అమిత్ షా లోక్‌సభలో ఒక బిల్లును ప్రవేశ పెట్టారు. అదే జమ్ము్మకశ్మీర్ రీ-ఆర్గనైజేషన్ బిల్లు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో రాజ్యాంగంలో 370 ప్రకరణం రద్దుచేసి దాని కింద పొందుపరిచిన జమ్ము్మకశ్మీర్ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక హెూదాను తొలగించింది. ఆ సందర్భంగా ఆ రాష్ట్రాన్ని జమ్ము్మకశ్మీర్, లద్దాఖ్ అని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ఆ ప్రాంతాలు లెఫ్టినెంట్ గవర్నర్ పరిపాలనలో ఉన్నాయి. ఆ తర్వాత అక్కడ ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించే దిశగా మొన్న రీ-ఆర్గనైజేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అంటే అక్కడ చట్టసభలను ఏర్పాటు చేయాలని ఆ బిల్లు ఉద్దేశం. అది హర్షణీయమైన చర్యగానే చూడాలి. అయితే ఆ బిల్లులో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో కూడా ఎన్నికలు జరపాలన్న అంశాన్ని చేర్చడం చర్చనీయాంశమైంది.**

ఇక్కడ క్లుప్తంగా చరిత్ర గురించి చెప్పాలి. మనకు బ్రిటిష్ వారు స్వాతంత్ర్యం ప్రకటించినప్పుడు రాజవంశీకుల అధీనంలో ఉన్న సంస్థానాల విషయం ఏమీ తేల్చకుండా వారి ఇష్టానికి వదిలేసింది. అంటే ఈ సంస్థానాలు స్వతంత్రంగా ఉండవచ్చు లేదా భారత్‌లో కానీ పాకిస్థాన్‌లో కానీ చేరవచ్చు. ఉదాహరణకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న నిజాం పాకిస్థాన్‌లో చేరాలనుకున్నాడు. అది చారిత్రక సత్యం. అలాగే జమ్ము్మకశ్మీర్ అనేది మహారాజ హరిసింగ్ ఆధీనంలో ఉన్నది స్వాతంత్ర్యం వచ్చేనాటికి. హరిసింగ్ స్వతంత్రంగానే ఉంటాను గానీ ఏ దేశంలోనూ చేరను అని తీర్మానించుకున్నారు. అయితే అక్కడ ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు తిరుగుబాటు చేశాయి హరిసింగ్‌కు వ్యతిరేకంగా. అప్పుడు ఆయన భారత ప్రభుత్వ సహాయాన్ని అర్థించాడు. భారత ప్రభుత్వం సహాయం కావాలంటే ఆయనను భారతదేశంలో చేరమని ప్రతిపాదించింది అప్పటి ప్రభుత్వం.

ఆ సూచన మేరకు హరిసింగ్ భారతదేశ సార్వభౌమత్వాన్ని అంగీకరిస్తూ ఒక ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచారం వంటి అంశాల మీద అధికారాలు భారత ప్రభుత్వానికి బదలాయించడం జరిగింది. అయితే ఆ రాష్ట్రానికి ఒక ప్రత్యేక స్థానాన్నిచ్చింది భారత ప్రభుత్వం. అక్కడ ఆ రాష్ట్రానికి చెందని భారతీయులు ఆస్తి కొనుగోలు చేసే అవకాశం లేదు. వారికొక రాజ్యాంగం, ఒక జెండా గట్రా ఉండేలా చేసింది ఆ ఒప్పందం కిందనే. క్రమేపీ జమ్ము్మకశ్మీర్ భారత భూ భాగంలో విడదీయరాని విధంగా కలిసిపోయింది. అయితే మహారాజు హరిసింగ్ మీద జరిగిన తిరుగుబాటు సందర్భంగా జమ్ము్మకశ్మీర్‌లోని కొంత భూ భాగం పాకిస్థాన్ ఆక్రమణలోకి వెళ్లింది. అదే ప్రస్తుతం పాక్ ఆక్రమిత కశ్మీర్‌గా గుర్తింపు పొందిన ప్రాంతం. ఇది పాకిస్థాన్ ఆధీనంలో ఉన్నదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. కానీ, మనం మాత్రం అది భారత భూ భాగమే అని అంటున్నాం.

పాక్ ఆక్రమిత కశ్మీర్, భారత ఆధీనంలోని కశ్మీర్ భూ భాగాల మధ్య ఉన్నదాన్ని వాస్తవ ఆధీన రేఖగా పిలుస్తారు. ఆ వాస్తవ ఆధీనరేఖ దాటి మనం అటు వెళ్లం, వాళ్లు ఇటు రారు. ఆ రేఖను దాటి అవతలికి వెళ్లి పాకిస్థాన్ సైన్యానికి బందీగా చిక్కిన అభినందన్ వర్ధమాన్ అనే భారత వాయుసేన పైలెట్ పేరు నేడు ఎంతమందికి గుర్తుందో కానీ, ఆనాడు దేశం అంతా కూడా వర్ధమాన్ సురక్షితంగా స్వదేశం రావాలని ప్రార్థించారు. మన ప్రార్థనలు ఫలించి ఆయన క్షేమంగా తిరిగివచ్చారు. మళ్లీ చెక్కుచెదరని, మొక్కవోని స్థయిర్యంతో ఆయన వాయుసేన విధుల్లో చేరారు. యావత్ దేశం హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నది. ఈ రేఖకు అటూ ఇటు ఇరుసైన్యాలు మోహరించి ఉంటాయి.


కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు ప్రకారం.. జమ్ము్మకశ్మీర్‌కు అసెంబ్లీ సీట్ల పునర్విభజనతో పాటు, పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతానికి కూడా కొన్ని సీట్లు కేటాయించారు. అది భారత భూభాగమే కావున అక్కడ కూడా ఎన్నికలు జరుపుతామని కేంద్రం అంటున్నది. మన ఆధీనంలో లేని ప్రాంతంలో మనం ఎలా ఎన్నికలు జరుపుతామనేదే ఇప్పుడు చర్చనీయాంశమైంది. కొద్దిరోజుల్లో పార్లమెంటుకు ఎన్నికలు జరుగనున్న తరుణంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పాక్ ఆక్రమిత కశ్మీర్లో ఎన్నికలు జరుపుతామని పార్లమెంటులో ప్రకటించటం ఇరుదేశాల మధ్య కొత్త వివాదాన్ని లేవనెత్తే ప్రయత్నంగా చూస్తున్నారు విశ్లేషకులు. మనకు హక్కున్నప్పటికీ మన ఆధీనంలో లేని దాన్ని తిరిగి పొందాలంటే దౌర్జన్యంగా లాక్కోవాలి. అలా చేస్తే అవతలి వారు ఊరుకోరు కదా? అందువల్లనే తగాదాలు వస్తుంటాయి. రెండు సైన్యాల మధ్య తగాదా అంటే యుద్ధమే అనుకోవాలి కదా! అణ్వాయుధాలు కలిగి యుద్ధం చేసిన చరిత్ర ఉన్న ఇరుదేశాల మధ్య ఘర్షణ అంటే అది రెండువైపులా అలజడి, ఆందోళన కలిగించే అంశం అనటంలో సందేహం లేదు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ మహారాజు హరిసింగ్ రాజ్యంలోని అంతర్భాగమే. అది తిరుగుబాటు ద్వారా పాకిస్థాన్ ఆధీనంలో ఉందిగానీ హరిసింగ్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం ఆ ప్రాంతం మనదే అన్నది మన వాదన. వాదన ఎలా ఉన్నప్పటికీ వాస్తవంగా అది మన ఆధీనంలో లేదు. ప్రతిపాదిత అసెంబ్లీలో ఆ ప్రాంతానికి కూడా కొన్ని సీట్లు కేటాయించటం వరకు సరే. ఆ ప్రాంతం మనది కాబట్టి అక్కడ కొన్ని సీట్లు కేటాయించటం సమంజసమే. అట్లా చెయ్యకపోతే దానిమీద మనం హక్కును వదులుకున్నట్టుగానే భావించే ప్రమాదం ఉన్నది. కశ్మీర్‌లో ఎన్నికలు జరిగినా, ఆ సీట్లు అలాగే ఖాళీగా ఉంటాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు కేటాయించిన సీట్లు అలాగే ఖాళీగా ఉంటాయి. అత్తారింటికి దారేదిలో సునందకు చెందిన షేర్లూ కుర్చీ అలాగే ఎవరూ కూర్చోకుండా ఖాళీగా ఉంచినట్టు. ఏదో ఒకరోజు తిరిగి రాకపోతుందా అన్న ఆశ ఉంది అక్కడ. మనం కూడా సెంటిమెంటల్‌గా ఆ సీట్లను ఖాళీగా ఉంచటం వరకు ఓకే. మనది కాబట్టి మన ఆధీనంలో లేకపోయినా అక్కడికి పోయి ఎన్నికలు జరుపుతామనుకోవటంలో సెంటిమెంటల్ అంశం కాస్తా మెంటల్ అంశంగా మారి లేనిపోని అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉన్న విషయాన్ని మనం మరువరాదు!

ఎందుకంటే పాకిస్థాన్ ఆధీనంలో ఉన్న భూ భాగంలో మనం ఏ విధంగా ఎన్నికలు జరుపుతాం?ఆ భూమి మనదే అనటం ఒక ఎత్తు. అక్కడికి పోవాలనుకోవటం మరో ఎత్తు. అక్కడికి పోయే అవకాశం లేకపోయినా అక్కడ కూడా ఎన్నికలు జరుపుతామనటం ఉత్తర కుమార ప్రగల్భాలు అనుకోవాలి. ప్రగల్భాలతో సరిపెడితే సరే. అంతవరకూ ఏ ఇబ్బంది లేదు. కానీ పార్లమెంటుకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఎన్నికల సమయానికి ప్రభుత్వానికి సాధించామని చెప్పుకోవటానికి ఏ అంశమూ లేక ఏదో చేశామని చూయించుకోవటానికి ఏదైనా సాహసానికి దిగితే అది ఇరుదేశాల మధ్య తీవ్ర సమస్యగా పరిణమించే ప్రమాదం ఉన్నది. ఇదే విజ్ఞులను, విశ్లేషకులను, పరిశీలకులను భయపెడుతున్నది.

అంతర్గత విషయాలను విదేశీ వ్యవహారాలు ప్రభావితం చెయ్యటమనేది ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు కొత్తేమీ కాదు. 1971లో పాకిస్థాన్ యుద్ధం చేసి బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన తర్వాత మన పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ఆ సంఘటన ప్రభావం చాలా ఉన్నది. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని అపరకాళితో పోల్చింది యావత్ భారతదేశం. నేటి బీజేపీ ప్రభుత్వానికి ఇప్పటిదాకా అంశం ఏదీ లేదు ప్రజలకు చూయించుకోవటానికి.

బీజేపీకి ఉన్న అంశాలన్నీ అనుత్పాదక అంశాలే. అయోధ్యలో మందిర నిర్మాణం కానీ, నూతన పార్లమెంటు భవన నిర్మాణం కానీ, 370 అధికరణం రద్దు గానీ, చంద్రయాన్-3 విజయం కానీ ప్రజల జీవితాన్ని ప్రభావితం చేసే ఉత్పాదక అంశాలు కావు. భావోద్వేగ అంశాలే కానీ, దేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచామని చెప్పుకోవటానికి పనికొచ్చే అంశాలు కాదు. అటువంటి సందర్భాల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే అవకాశం ఉన్న అంశం ఇది. అందుకే ప్రజాభిప్రాయం స్థిరంగా నిలిచి ప్రభుత్వ ఆలోచనకు బ్రేకు వేసేదిగా ఉండాలి. ఇరు దేశాల మధ్య ఇప్పుడున్న సమస్యలు చాలు. కొత్త సమస్యలు అవసరం లేదు. రెండువైపులా ప్రజలు శాంతినే కోరుకుంటున్నారు. అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో నివసించే భారతీయులు, పాకిస్థానీయులు ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారు. ఇద్దరి మధ్య సంబంధ బాంధవ్యాలను నెలకొల్పే ఉమ్మడి అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని పెంపొందిద్దాం. సుహృద్భావ వాతావరణం కోరుకుందాం.



# రెండో గొంతు

మనదైనది ఏదో వ్యక్తం చేయడానికి మనదైన భాష ఒకటి ఉండాలనుకుంటాం. కానీ భాష చిత్రమైంది. ఒక్కోసారి అనుకున్న మాట వెంటనే తట్టదు. ఇంకో సందర్భంలో ఆ ఒక్కమాటకు పది మాటలు కనబడి గందరగోళ పరుస్తాయి. రెండు సందర్భాల్లోనూ మనిషి మూగ కావడం గమనార్హం. ఇదంతా భాష సమస్య కాదేమోబీ మన లోపలి భావానికి అనుగుణంగా భాష మనల్ని ఇలా ఒంటరిగా మాట తోడులేకుండా నిలబెట్టే స్థితిని కల్పిస్తుందేమో! భావం అనేది చాలా సంక్లిష్టమైంది కదా మరి! దాన్ని భాషలోకి తేవాలని అనుకున్నప్పుడు, ఎంతో తెలుసు అనుకున్నది కూడా, ఏ కొసను అందుకోవాలో తెలియక తికమక పరుస్తుంది. ఒక తేనెతుట్టె ఏదో లోపల కదిలినట్టయి గందరగోళం తలెత్తుతుంది. అనుకున్న వ్యక్తీకరణ గాడి తప్పుతుంది. భావాన్ని వ్యక్తపరచడానికి ఏ భాష అయితే కావాలో అదే అవరోధంగా మారడం తమాషా కదా! మరి దానికేమిటి దారి? సంజ్ఞలైతే పనికిరావు. కాబట్టి మళ్లీ భాషే దిక్కు. పోనీ, ఇంకేదో భాష అయితే? అందులో మనకు అంతగా ప్రవేశం లేనిదైతే? ఒక్కోమాటా వాక్యంగా పేర్చుకునేదైతే? నిజంగా అలా రాయడం సాధ్యమా? ప్రపంచ సాహిత్యంలో పేరెన్నికగన్న కొందరు రచయితలు ‘తమది కాని’ భాషలో సాహిత్యం సృజించారు. 1978లో బేస్‌బాల్ గేమ్ చూస్తున్నప్పుడు, ఆటగాడు బంతిని బలంగా కొట్టిన బ్యాట్ శబ్దం టోక్యో శివార్లలోని ‘జింగు’ స్టేడియం మొత్తం ప్రతిధ్వనించిన ఒకానొక క్షణాన ఇరవైల్లో ఉన్న హరూకీ మురకామీకి ఉన్నట్టుండి తానూ రాయగలనని అనిపించింది. ఆ క్షణం ఆయనలో ఏదో ఎల్లలు లేని సృజనావేశం తన్నుకొచ్చింది. దాన్ని అలాగే పోనీయకుండా కొన్ని నెలలు శ్రమించి, రాత్రుళ్లు కుస్తీపట్టి జపనీస్ భాషలో మొదటి నవల రాయడానికి ప్రయత్నించాడు. అంతా అయ్యాక చదివితే ఆయనకే నచ్చలేదు. దీనికి కారణం %--% తన మాతృభాషలో ‘పశువుల కొట్టంలో పశువులు క్రిక్కిరిసినట్టుగా’ ఆలోచనలు రొద పెట్టడమే! దీనివల్ల ఉక్కిరిబిక్కిరికి లోనయ్యాడు. ‘ఒకరి భావాలను అలవోకగా ఒక క్రమంలో పెట్టడం గురించి మాట్లాడటం సులభమేగానీ, అలా చేయడం అంత సులభం కాదు. బొత్తిగా అప్పుడే రాయడం మొదలుపెట్టిన నా లాంటివాడికి అది మరింత కష్టం. కొత్తగా మళ్లీ ప్రారంభించడానికి, నేను చేయాల్సివచ్చిన మొదటి పని నా రాతప్రతుల కుప్పనూ, ఫౌంటెన్ పెన్ నూ వదిలించుకోవడం! అవి నా ముందు ఉన్నంతసేపూ నేనేదో ‘సాహిత్యం’ లాంటిదాన్ని రాస్తున్నట్టనిపించింది. వాటి స్థానంలోకి నా పాత అలవెటీ టైప్‌రైటర్‌ను అల్మారా లోంచి తెచ్చాను. తర్వాత, ఒక ప్రయోగం లాగా, నా నవల ప్రారంభాన్ని ఇంగ్లీష్‌లో రాయాలని నిర్ణయించుకున్నాను. ఎటూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకున్నప్పుడు ఇలా ఎందుకు చేయకూడదనిపించింది?’ అంటూ మురకామీ తాను తన జపనీస్‌ను కాదని ఆంగ్లంలో రాయడానికి పూనుకోవాల్సి వచ్చిన నేపథ్యం చెబుతాడు. అయితే, ఆంగ్లం ఆయనకేమీ మంచినీళ్ల ప్రాయం కాదు. ఈ భాష పరిమితి వల్ల సంక్లిష్ట వాక్యాలు రాయడం కుదరదు. ఆ ఉన్న కొద్దిపాటి పదసంపద, వ్యాకరణాలనే ప్రతిభావంతంగా ఉపయోగించుకోవాలి. ‘మై కిచెన్ టేబుల్ ఫిక్షన్ ’ ధోరణిగా వర్ణించే ఆయన రచనలు అలా మొదలయ్యాయి. ఈ ధోరణిలో వచ్చిన ‘హియర్ ద విండ్ సింగ్’ నవలిక మురకామీని అమాంతం పైకి ఎత్తేసింది. కృత్యాదిలోనే మురకామీ అవస్థ పడ్డాడు. కానీ ఝుంపా లాహిరిది ఇంకో కథ. లండన్ లో పుట్టి, అమెరికాలో పెరిగిన భారత(బాంగ్లా) సంతతి ఝుంపా ‘ఇంటర్‌ప్రిటర్ ఆఫ్ మాలడీస్’ నవలకు ‘పులిట్జర్’ గెలుచుకుంది. ‘నేమ్‌సేక్’తో మరింత పేరొచ్చింది. ఉన్నట్టుండి తన నలభై ఐదేళ్ల వయసులో ఇటాలియన్ లో రాయాలని నిర్ణయించుకుంది. కొత్త భాషలో రాయడంలో ఒక స్వేచ్ఛ ఉంది అంటారామె. ‘పర్ఫెక్టుగా ఉండనక్కరలేని స్వేచ్ఛ’. న్యూయార్క్‌లో కొన్ని ఇటాలియన్ పాఠాలు విన్న అనుభవం ఉంది. కానీ ఆ భాష కోసమే 2015లో ఆమె కుటుంబంతో సహా రోమ్‌కు వెళ్లి, కొన్నేళ్లు ఉండివచ్చింది. తర్వాత మూడు పుస్తకాలు ఇటాలియన్ లో వెలువరించింది. తర్వాత అవి ఆంగ్లంలోకి వచ్చాయి. సహజంగానే ఇటాలియన్ లో రాయడమేంటని చాలామందే ఆమెను ప్రశ్నించారు. ఒక్కొక్క పదం, వాక్యం ద్వారా వ్యక్తీకరణను కూడగట్టుకొని కొత్త లోకపు ద్వారంలోకి ప్రవేశించినట్టుగా అనుభూతి చెందానంటుంది. పాత, కొత్త ప్రపంచాల మధ్య అదొక సవాలు కూడా! ‘ఇటాలియన్ భాష నా జీవితాన్నేమీ మార్చలేదుబీ అది నాకు రెండో జీవితాన్ని ఇచ్చిందిబీ మరో అదనపు జీవితం’. తన అసంబద్ధ రచన ‘వెయిటింగ్ ఫర్ గోడో’ ద్వారా ఖ్యాతినొందిన శామ్యూల్ బెకెట్ పుట్టుకతో ఐరిష్‌వాడు అయినప్పటికీ ఫ్రెంచ్‌ను తన రచనాభాషగా ఎంచుకున్నాడు. దానికి ఆయన చెప్పిన కారణాలు సాధారణంగా రచయితలు కోరుకునే లక్షణాలకు పూర్తి విరుద్ధమైనవి. తన మాతృభాషకు దూరం కావడం అనేది, ఒక ముసుగును చించుకోవడంతో సమానంగా చూశాడు. ఫ్రెంచ్‌లో (పరాయి భాష) మాత్రమే ఒక శైలి లేకుండా రాయడం సాధ్యమవుతుందన్నాడు. అలాగైతేనే తనకు తగిన వనరులు లేకుండా పోతాయన్నాడు. అందువల్లేనేమో, ఆయన ప్రసిద్ధ ‘మినిమలిస్ట్’ రచయిత కాగలిగాడు. వేర్వేరు కారణాల వల్ల తమ మాతృభాషలకు దూరమైన రచయితలు ఎందరో ఉన్నారు. పరిస్థితులు వారికి అలాంటి పరీక్ష పెట్టాయి. ఆ వేదన ఇక్కడ అప్రస్తుతం. కానీ భాష అనేదాన్ని ఒక అవరోధంగా పెట్టుకుని రాయాలనుకోవడం దానికదే ఒక సవాలు. ప్రాణవాయువును మరీ ఎక్కువగా పీల్చకుండా పొదుపుగా వాడుకుంటూ బతికే యోగసాధన లాంటిది అది.

# రైలు ప్రయాణం మెరుగుపడేదెప్పుడు?





సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ. భారతీయ ఆర్థికవ్యవస్థకు రైల్వే విభాగం జీవనాడి వంటిది. ఏటా రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ దానికి తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన పెరగటం లేదు. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. మెట్రో నగరాల్లో రైల్వే బ్రిడ్జిలు రద్దీగా ఉండి ప్లాట్‌ఫాం మొదలు నుంచి చివరి వరకు చేరుకునేందుకు కనీసం 15 నిమిషాలు పడుతున్నది. రద్దీ సమయాల్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయక పోవడం నిత్యకృత్యం. సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బం దులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ. మూత్రశాలల్లో నీరు లేకపోవడం, భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రయాణికులు వాపోతుం డటం గమనార్హం. బోగీల్లో అపరిశుభ్రత ప్రయాణికుల ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నది. ఒకే రైలును పేరు మార్చి వివిధ రూట్లలో తిప్పడం వల్ల బోగీలను, టాయ్ లెట్లను శుభ్రపరచడం, బెర్తులు, సీట్లు, చెడి పోయిన నల్లాలు, పైపుల మరమ్మతు చేసే సమయం కూడా ఉండటం లేదని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ఒక్కోసారి ఎటువంటి ముందస్తు సూచనలు తెలపకుండా ప్యాసింజర్ రైళ్లు రద్దుచేయడం లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యం తగ్గించడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వారంలో మిగ్‌జాం తుఫాన్ వల్ల రైళ్లు రద్దుచేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రద్దుచేయడం మంచిదే, కానీ, తుపాన్ ప్రభావం లేని ఖాజీపేట, విజయవాడ జంక్షన్ల మధ్య ప్రతిరోజు నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా కేంద్రంలోని పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వారు కేవలం హామీలు, గ్యారంటీలకు పరిమితమయ్యారు. రైల్వేలు ప్రజల సొమ్ముతో నిర్మించినవి. అందుబాటు ధరల్లో సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల వద్ద వసూలు చేసిన పన్నులు ద్వారా వచ్చిన సొమ్ముతో ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచాలి. వయో వృద్ధులకు గతంలో ఇచ్చిన రాయతీలు పునరుద్ధరించాలి. కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో చంద్రయాన్‌కు రాకెట్ పంపినప్పుడు అంతకన్నా తక్కువ ఖర్చుతో రైళ్ల సంఖ్య పెంచి స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, నూతన ప్యాసింజర్ రైళ్లు, బోగీల సంఖ్య పెంచవచ్చు. సుఖవంతమైన, ఎటువంటి అసౌకర్యం లేకుండా పరిశుభ్రమైన రైలు ప్రయాణం చేసినప్పుడే ‘స్వచ్ఛ రైల్- స్వచ్ఛ్ భారత్’ నినాదానికి సార్థకత ఏర్పడుతుంది. ఈ దిశగా రైల్వే అధికారులు దృష్టి సారించాలి.

# తెరల బందీలో బంధాలు



**ఇటీవలి రోజుల్లో సమాజాన్ని కలచివేసిన కొన్ని ఘటనలు చాలామందిని ఆలోచనలో పడేశాయి. మొబైల్ ఫోన్ తీసేశారని తల్లిపై చేయి చేసుకున్న కొడుకు, క్లాస్‌రూంలో అధ్యాపకురాలిపై దురుసుగా ప్రవర్తించిన విద్యార్థినిఇలాంటి ఉదంతాల వెనక ఉన్న అసలు కారణం ఏమిటన్న ప్రశ్నకు సమాధానం ఒకటే కనిపిస్తోంది. అది ఫోన్‌కు అలవాటు కాదు, ఫోన్‌కే జీవితం అంకితం చేయడం. మన చుట్టూ ఉన్నవారిని పూర్తిగా విస్మరించి, తెరలోని ప్రపంచానికే ప్రాధాన్యం ఇవ్వడమే ఈ ధోరణి. దీనినే ఇప్పుడు 'ఫబ్బింగ్'గా పిలుస్తున్నారు.**



స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడు, కుటుంబంతో కలిసి ఉన్నప్పుడు, తరగతిలో లేదా కార్యాలయంలో ఉన్నప్పటికీ ఫోన్ స్క్రీన్ నుంచి చూపు తిప్పలేకపోవడం ఈ అలవాటుకు లక్షణం. సందేశాలు, సోషల్ మీడియా అప్‌డేట్‌లు, వీడియోలుఇవన్నీ ప్రత్యక్ష సంభాషణలకన్నా ముఖ్యంగా మారిపోయాయి. ఈ డిజిటల్ నిర్లక్ష్యం ఎంతలా విస్తరించిందంటే, ఇటీవల నగర విద్యార్థులపై చేసిన ఓ అధ్యయనంలో సగానికి పైగా యువత ఈ అలవాటుకు లోనై ఉన్నట్లు తేలింది. వారిలో చాలామంది మానసిక ఒత్తిడి, అస్థిరత, ఆందోళన వంటి సమస్యలతో బాధపడుతున్నారని వెల్లడైంది. ఈ ఫోన్ బానిసత్వానికి పలు కారణాలు ఉన్నాయి. ఏదైనా సమాచారం మిస్ అవుతామనే భయం ఒకవైపు ఉంటే, మరోవైపు పదేపదే ఫోన్ చూసే అలవాటు మనల్ని నియంత్రిస్తోంది. కొందరు అసౌకర్యంగా అనిపించే సంభాషణల నుంచి తప్పించుకోవడానికి మొబైల్‌ను ఒక రక్షణ కవచంలా వాడుతున్నారు. ఆన్‌లైన్‌లో లభించే తక్షణ ఆనందం, లైక్స్, కామెంట్లు నిజ జీవితంలోని అనుభూతుల్ని మసకబారుస్తున్నాయి. ఈ ధోరణి ప్రభావం ఫోన్ వాడేవారికే కాదు, వారి చుట్టూ ఉన్నవారిపైనా తీవ్రంగా పడుతోంది. తమ మాటలకు విలువ లేదన్న భావన చాలామందిలో ఒంటరితనాన్ని పెంచుతోంది. నిర్లక్ష్యం ఎదుర్కొనే వ్యక్తుల్లో కోపం, నిరాశ, అసంతృప్తి పెరిగి సంబంధాల్లో దూరం ఏర్పడుతోంది. కొన్నిసార్లు ఇవే భావోద్వేగాలు తీవ్రమైన ప్రతిస్పందనలకు, హింసాత్మక చర్యలకు దారి తీస్తున్నాయి. బంధాల్లో నమ్మకం క్రమంగా క్షణించి, మానసిక ఆరోగ్యం దెబ్బతిం టోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడటం అసాధ్యం కాదు. కొంత ఆత్మపరిశీలన, కొద్దిపాటి నియమాలు జీవితాన్ని మళ్లీ సమతు ల్యంలోకి తీసుకురాగలవు. కలిసి ఉన్న సమయాల్లో ఫోన్‌ను దూరంగా ఉంచడం, భోజనం లేదా సంభాషణ సమయంలో తెరల్ని పక్కన పెట్టడం వంటి చిన్న నిర్ణయాలు పెద్ద మార్పుని తీసుకువస్తాయి. అనవసర నోటిఫికేషన్లను తగ్గించడం, రోజులో కొంత సమయానికే ఫోన్ వినియోగాన్ని పరిమితం చేయడం ద్వారా దృష్టి చెల్లాచెదరుకాకుండా ఉంటుంది. ఫోన్ చేతిలోకి వచ్చిన ప్రతిసారి 'ఇది నిజంగా అవసరమా?' అని మనల్ని మనమే ప్రశ్నించుకోవడం అలవాటు చేసుకుంటే డిజిటల్ మోజు తగ్గుతుంది. ఎదుటివారితో మాట్లాడేటప్పుడు వారి మాటలను శ్రద్ధగా వినడం, కళ్లలోకి చూసి స్పందించడం బంధాలకు మళ్లీ ప్రాణం పోస్తుంది. ఫబ్బింగ్ ఒక వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు, సామాజిక సమస్యగా మారుతున్న నేపథ్యంలో కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి దీనిపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. తెరల ప్రపంచాన్ని కాసేపు పక్కన పెట్టి, మనుషుల మధ్య ఉన్న నిజమైన అనుబంధాలకు మళ్లీ విలువ ఇవ్వడమే దీనికి సరైన పరిష్కారం.

# అద్భుతమైన అంజీరా!

**చలికాలం మొదలైతే శరీరంలో ని రోగనిరోధక శక్తి సహజంగానే తగ్గిపోతుంది. ఈ సమయంలో వైరల్ ఇన్ఫెక్షన్లు, జలుబు, దగ్గు, జీర్ణ సమస్యలు చాలామందిని వెంటాడుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆహారంలో చిన్న మార్పు పెద్ద రక్షణగా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా అంజీర్ పండ్లు చలికాలంలో శరీరానికి సహజ ఔషధంలా పనిచేస్తాయని నిపుణుల అభిప్రాయం. రోజూ ఒకటి లేదా రెండు అంజీర్ పండ్లు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన కీలక పోషకాలు అందుతాయి.**

అంజీర్‌ను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తినడం ఉత్తమ మార్గంగా భావిస్తారు. పండ్లతో పాటు నానబెట్టిన నీటిని కూడా తాగితే అందులో కరిగిన ఖనిజాలు, సూక్ష్మ పోషకాలు పూర్తిస్థాయిలో శరీరంలోకి చేరుతాయి. చలికాలంలో నీటి తీసుకోవడం తగ్గిపోవడంతో చాలామందికి మలబద్ధకం సమస్య తలెత్తుతుంది. అంజీర్‌లో ఉండే అధిక ఫైబర్ జీర్ణవ్య వస్థను చురుకుగా ఉంచి సహజ విరేచనకారిగా పనిచేస్తుంది. దీంతో మల బద్ధకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అంజీర్ పండ్లలో సమృద్ధిగా లభించే క్యాల్షియం చలికాలంలో ఎక్కువగా వేధించే కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. వయసు పెరిగేకొద్దీ వచ్చే ఎముకల బలహీనత, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల నుంచి రక్షణనిస్తుంది. అలాగే ఇందులో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచి రక్తంలో చ్కర స్థాయిలను నియంత్రించడంలో తోడ్పడుతుంది. టైప్‌ఉ2 డయాబెటిస్‌తో బాధపడేవారికి ఇది సహజ సహాయకుడిగా నిలుస్తుంది. రక్తంలో పెరిగే చెడు కొవ్వు స్థాయిలను తగ్గించడంలో కూడా అంజీర్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులోని పొటాషియం రక్తపోటును సమతుల్యంలో ఉంచి గుండెపై ఒత్తిడి తగ్గిస్తుంది. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం క్రమంగా తగ్గే అవకాశం ఉంటుంది. విటమిన్ సి, విటమిన్ ఇతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంతో జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లకు శరీరం బలంగా ఎదురు నిలబడుతుంది. అంజీర్‌లో లభించే ఐరన్ రక్తహీనతతో బాధపడేవారికి ఎంతో ఉపయోగకరం. రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలను పెంచి శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తుంది. అంతేకాదు, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ అంజీర్ ప్రభావవంతం గా పనిచేస్తుంది. రెగ్యులర్‌గా అంజీర్ తీసుకుంటే చర్మం తేమతో నిండినట్టుగా, సహజ కాంతితో కనిపిస్తుంది. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే చలికాలంలో అంజీర్‌ను ఆహారంలో భాగంగా మార్చుకోవడం ఆరోగ్యానికి మేలైన అలవాటుగా చెప్పవచ్చు.



# ఆపిల్ టీతో ఆరోగ్యం



ఒక సాధారణ ఆపిల్ పండు నుంచి టీ కప్పు వరకు ప్రయాణం చేస్తే ఆరోగ్య ప్రయోజనాలు మరింత పెరుగుతాయన్న విషయం చాలామందికి తెలియదు. రోజూ తాగే టీకి భిన్నంగా, సహజమైన పోషకాలతో నిండిన ఆపిల్ టీ ఇప్పుడు ఆరోగ్యాన్ని కోరుకునే వారి తొలి ఎంపికగా మారుతోంది. రుచితో పాటు శరీరానికి మేలు చేసే గుణాలే దీనికి ప్రత్యేక ఆకర్షణ.పండ్లలో ఆపిల్‌కు ఉన్న పేరు అంతా ఇంతా కాదు. జీర్ణక్రియను చురుకుగా ఉంచడం నుంచి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు ఎన్నో లాభాలు ఇందులో దాగున్నాయి. అదే ఆపిల్‌ను టీ రూపంలో తీసుకుంటే, దాని పోషకాలు మరింత సులభంగా శరీరంలోకి చేరతాయి. ముఖ్యంగా మారుతున్న జీవనశైలిలో తేలికగా జీర్ణమయ్యే పానీయం కావాలనుకునేవారికి ఇది మంచి ప్రత్యామ్నాయం.ఆపిల్ టీకి ప్రధాన బలం ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు. ఇవి శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. వాతావరణ మార్పుల వల్ల తరచూ జలుబు, దగ్గు లాంటి సమస్యలు ఎదుర్కొనే వారికి ఈ టీ మంచి రక్షణ కవచంలా పనిచేస్తుంది. రోజూ ఒక కప్పు తాగడం ద్వారా రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది.జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారికి కూడా ఆపిల్ టీ ఉపశమనం ఇస్తుంది. ఆపిల్‌లో సహజంగా ఉండే మాలిక్ యాసిడ్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. పొట్టలో బరువుగా అనిపించడం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు క్రమంగా తగ్గుతాయి. అంతేకాదు, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలోనూ ఇది సహాయపడుతుంది.బరువు తగ్గాలనుకునే వారికి ఆపిల్ టీ మరింత అనుకూలం. ఇందులో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. చక్కెర కలిపిన టీ లేదా కాఫీకి బదులుగా దీన్ని అలవాటు చేసుకుంటే అనవసరమైన కొవ్వు చేరకుండా ఉంటుంది. ఆకలి ఎక్కువగా వేయకుండా నియంత్రించడంలోనూ ఇది తోడ్పడుతుంది.గుండె ఆరోగ్యానికి కూడా ఆపిల్ టీ ఉపయోగకరం. ఇందులోని ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. రక్తప్రసరణ సక్రమంగా ఉండేలా చేసి, హృదయ సంబంధిత సమస్యల ముప్పును తగ్గిస్తాయి. రోజువారీ ఆహారంలో చిన్న మార్పుగా ఆపిల్ టీని చేర్చుకుంటే దీర్ఘకాలంలో మంచి ఫలితాలు కనిపిస్తాయి.ఇంతటి ప్రయోజనాలున్న ఆపిల్ టీని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. నీటిలో ఆపిల్ ముక్కలు, టీ ఆకులు, కొద్దిగా నిమ్మరసం, దాల్చిన చెక్క కలిపి మరిగిస్తే సరిపోతుంది. సహజ రుచి, ఆరోగ్య గుణాల కలయికగా తయారయ్యే ఈ టీ రోజును తాజాగా ప్రారంభించడానికి లేదా సాయంత్రం శరీరానికి ఊరట కలిగించడానికి చక్కటి ఎంపికగా నిలుస్తుంది.

**చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల కీళ్లు బిగు సుకుపోయి నొప్పులు రావడం సహజం. ఈ సీజనల్ ఇబ్బందులను తొలగించి, మీ కీళ్లకు మునుపటి బలాన్నిచ్చే 'సూపర్ ఫుడ్స్' ఇవే..**

# కీళ్ల నొప్పులకు ఇలా చెక్



**పసుపు:** ఇందులో ఉండే 'కర్కుమిన్' వాపులను తగ్గి స్తుంది. రాత్రిపూట పసుపు కలిపిన పాలు తాగడం వల్ల కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**అల్లం:** ఇది సహజ నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. అల్లం టీ తాగడం వల్ల, లేదంటే వంటల్లో అల్లం వాడటం ద్వారా కీళ్ల వాపులను తగ్గించుకోవచ్చు.

**ఆవకూర:** విటమిన్–, కాల్షియం మెండుగా ఉండే ఈ ఆకుకూర ఎముకల మృదులాస్థిని కాపాడుతుంది.

**నువ్వులు:** కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉండే నువ్వులు ఎముకల సాంద్రతను పెంచి కీళ్లకు బలాన్నిస్తాయి.

**ఉసిరి:** విటమిన్–సి పుష్కలంగా ఉండే ఉసిరి కణజా లాల మరమ్మతుకు, కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడు తుంది.

**మెంతులు:** యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలున్న మెంతులు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి.

**నెయ్యి:** పరిమితంగా నెయ్యి తీసుకోవడం వల్ల అది కీళ్లకు లూబ్రికెంట్‌లా పనిచేసి కదలికలను సులభతరం చేస్తుంది.

**రాగులు:** కాల్షియం ఎక్కువగా ఉండే రాగులు ఎము కలను దృఢంగా ఉంచి కీళ్లపై ఒత్తిడిని తగ్గిస్తాయి.



## చేతికి పట్టీతో మెగాస్టార్.. అభిమానుల్లో ఆందోళన

మెగాస్టార్ చిరంజీవి చేతికి పట్టీతో కనిపించడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఆయనకు ఏమైనా గాయమైయిందా? రాబోయే ప్రాజెక్టులపై ప్రభావం ఉంటుందా? అనే చర్చలు మొదలయ్యాయి. అయితే రూమర్స్ కి తావులేకుండా చిరంజీవి స్వయంగా ఎక్స్ వేదికగా స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. ఎలాంటి పెద్ద ఆరోగ్య సమస్య లేదని, కేవలం చిన్నపాటి షోల్డర్ కీహోల్ సర్జరీ మాత్రమే జరిగిందని స్పష్టం చేశారు మెగాస్టార్. ఇది ముందస్తు జాగ్రత్తగా చేసిన సాధారణ ప్రక్రియ అని, ప్రస్తుతం తాను సాఫీగా కోలుకుంటున్నానని, సర్జరీను విజయవంతంగా నిర్వహించిన ప్రముఖ ఆర్థ్రోస్కోపీ నిపుణుడు డా. నితిన్‌కు ధన్యవాదాలు తెలిపారు. "చేతికి పట్టీ ఉండటం గమనించి అభిమానులు, శ్రేయోభిలాషులు నా ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఇది కేవలం చిన్నపాటి షోల్డర్ కీహోల్ సర్జరీ. ప్రస్తుతం నేను కోలుకున్నాను, నా దినచర్య సజావుగా సాగుతోంది. ఈ సర్జరీని ఎంతో నైపుణ్యంతో, సాఫీగా నిర్వహించిన అత్యుత్తమ ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ నితిన్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## వేసవిలో దండయాత్రకు సిద్ధమైన టాలీవుడ్





వేసవి సీజన్‌ను టార్గెట్ చేస్తూ టాలీవుడ్‌లో వరుస సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. మార్చిలో యశ్ నటించిన 'టాక్సిక్', పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' వంటి భారీ చిత్రాలు రానున్నాయి. ఏప్రిల్‌లో రామ్ చరణ్ 'పెద్ది', నిఖిల్ 'స్వయంభు', శర్వానంద్ 'బైకర్' విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఐపీఎల్ ప్రభావం ఉన్నప్పటికీ మేకర్స్ ధైర్యంగా ముందడుగు వేస్తుండటం విశేషం. మార్చి మొదటి వారంలోనే కొత్త సినిమాల జోరు మొదలు కాబోతుంది. లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సతీ లీలావతి' మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే రోజున శివాజీ, లయ కీలక పాత్రల్లో నటించిన కుటుంబ కథా చిత్రం 'సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని' కూడా థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధమవుతోంది. మార్చి 13న చిన్న చిత్రం 'బ్యాండ్ మేళం' ప్రేక్షకులను అలరించనుంది. బాలీవుడ్ హిట్‌కు సీక్వెల్‌గా రూపొందిన 'ధురంధర్ 2' కూడా తెలుగులో విడుదల కానుంది. రూ.1300 కోట్లకు పైగా కలెక్షన్లతో దుమ్మురేపిన 'ధురంధర్'కి కొనసాగింపుగా వస్తోన్న ఈ చిత్రం హిందీతో పాటు తెలుగు, కన్నడ, తమిళ్, మలయాళ భాషల్లోనూ విడుదల కానుంది.

## విజయ్ దేవరకొండ,రశ్మిక పెళ్లి 26న, రిసెప్షన్ మార్చి 4



విజయ్ దేవరకొండ, రశ్మిక వివాహం ఈ నెల 26న జరుగబోతోంది. మార్చి 4న జరిగే వెడ్డింగ్ రిసెప్షన్‌కు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయ్ దేవరకొండ కలిసి, తన పెళ్ళికి ఆహ్వానించారు. ఇదిలా ఉంటే... విజయ్ దేవరకొండ, రశ్మిక వివాహ ఆహ్వాన పత్రిక ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ఈ నెల 26న వీరి పెళ్ళి జరుగబోతోంది. అయితే దాన్ని కేవలం కుటుంబ సభ్యులకు మాత్రమే పరిమితం చేశారు. మిగిలిన వారందరినీ మార్చి 4న హైదరాబాద్ తాజ్ కృష్ణాలో జరిగే రిసెప్షన్‌కు వీరు ఆహ్వానిస్తున్నారు.



## 'సెయాన్' పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్

వర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న కొత్త చిత్రం కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి "సెయాన్" అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 2026లో బిగ్గెస్ట్ ఫ్యామిలీ స్పెక్టకిల్‌గా నిలిచేలా ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, వినోదాన్ని మేళవిస్తూ ఈ సినిమా రూపొందుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శివకార్తికేయన్ డివైన్ ల్లూక్ కనిపిస్తున్నారు. ధోతి, విభూతి, రుద్రాక్షలతో సంప్రదాయానికి దగ్గరగా కనిపిస్తూ, చేతిలో వంపు ఉన్న కత్తి ఆయన ప్రశాంతత వెనుక దాగిన శక్తిని సూచిస్తోంది. ఈ చిత్రంలో శివకార్తికేయన్ పవర్‌ఫుల్, డైనమిక్ పాత్రలో కనిపించనున్నారు. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన "సెయాన్" 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది.

## హే బలవంత్‌తో ఫుల్ ఎంటర్‌టైన్ అవుతారు: హీరోయిన్ శివానీ నగరం



బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే బలవంత్' ( హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రంలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హీరో శివానీ నగరం సోమవారం పాత్రికేయులతో ముచ్చటించారు. ఈ సినిమాలో చాలా లైటర్ వెయిన్.. ఎంటర్‌టైన్‌మెంట్ పాత్ర. చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన పాత్ర నాది. సినిమా మొత్తం ఆడియన్స్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అవుతారు. చివర్లో ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ కూడా అందర్నీ అలరిస్తుంది. సినిమాలో ఇంటర్వెల్ బ్యాంగ్ మీకు సర్‌ప్రైజ్ ఉంటుంది. బాగా ఎంజాయ్ చేస్తారు. ఫస్ట్ సినిమాలో కామెడీలో లేదు. సెకండ్ సినిమాలో ఫుల్ కామెడీ, ఈ సినిమాలో కూడా కామెడీ ఉంది. వినగానే కథతో పాటు నా పాత్ర కూడా బాగా నచ్చింది. ఈ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలో కలర్‌ఫుల్ విజువల్స్, మ్యూజిక్ బాగుంటుంది. వెన్నెల కిషోర్. నరేష్ కామెడీ అలరిస్తుంది. ప్రతి పాత్ర మిమ్మలను నవ్విస్తుంది. మా ఇంట్లో వెరీ సపోర్టింగ్.. వాళ్లు ఇచ్చిన అవకాశాన్ని మంచి సినిమాలతో ప్రూవ్ చేసుకున్నాను. వాళ్లు కూడా ఎంతో హ్యాపీగా ఉన్నారు. వచ్చిన సక్సెస్‌ను అడ్వాంటేజీగా తీసుకుని తదుపరి సినిమా కమిట్ అవుతాను. కానీ కథ నచ్చితేనే కాంబినేషన్‌తో సంబంధం లేకుండా సినిమా ఒప్పుకుంటాను అన్నారు హీరోయిన్ శివానీ నగరం.

## డ్యాన్సర్ శ్రష్టి వర్మ కొరియోగ్రఫీ లో 'ధర్మస్థల నియోజకవర్గం'



మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రంతో ప్రముఖ డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఓ ఐటెం సాంగ్ తో ఎంట్రీ ఇస్తున్నారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుశీ భాస్కర్ నిర్మిస్తోన్న పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రానికి సంబంధించి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. 'న్యాయం చేయరా దేవుడా..' అంటూ వర్మ డ్యాన్స్ నెంబర్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ.. ఒక డిఫరెంట్ పొలిటికల్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ చిత్రంలో సీనియర్ నటులైన సాయికుమార్, సుమన్‌లతో పాటు యంగ్ హీరోస్ కూడా నటిస్తున్నారు. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటి వరకు లేని విధంగా.. డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఈ చిత్రంలో ఓ ఐటెం సాంగ్ తో ఎంట్రీ ఇస్తున్నారు. ఆమె ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ కానున్నారు. 'న్యాయం చేయరా దేవుడా..' లిరికల్ సాంగ్‌తో మ్యూజిక్ ప్రమోషన్స్‌ని మొదలు పెట్టబోతున్నాం. ఈ సాంగ్‌లో శ్రష్టి వర్మ స్టెప్స్ అందరినీ కనువిందు చేయనున్నాయి. ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ అందించిన లిరిక్స్, స్టార్ సింగర్ సునీత ఆలపించిన పాటలు ఈ చిత్రానికి మరో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనున్నాయి.

PUBLISHED BY **G.KALPANA** AND **PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS**, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : **G.DAYAKAR REDDY**, **RNI :TELTEL/2022/83927**, PHONE NUMBER 9908293393,040- 45046154